టిడ్కో గృహ సముదాయం సమస్యల మయంగా మారిపోయింది. టీడీపీ హయాంలో ఈ ఇళ్లు నిర్మించినా లబ్ధిదారులకు అప్పగింతలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. ఎన్నో పోరాటాల తర్వాత పేదలకు ఇళ్ల తాళాలు అప్పగించినా మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ యంత్రాంగం చేతులెత్తేసింది. కనీసం గొంతు తడుపుకుందామనుకున్నా బిందెడు నీరు రాక అవస్థలు పడుతున్నారు. ఎటు చూసినా చెత్తాచెదారం, మురుగు నిల్వ, పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. చాలా ఇళ్లు ఖాళీగా ఉండటంతో ఆకతాయిల బెడద ఎక్కువైంది. ఆహ్లాదం పంచాల్సిన ఉద్యానవనాలు కళావిహీనంగా మారిపోయాయి. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రాంతాల్లోని టిడ్కో గృహ సముదాయాలను ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించగా, పేదలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుమిలి పోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం

- నిర్వహణ గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారుల అవస్థలు

టిడ్కో గూడు.. సమస్యల గోడు !

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 31 : నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన దాదాపు 4,800 టిడ్కో అపార్ట్‌మెంట్లలోని ఇళ్లలో 60 శాతం మేర ప్రజలు నివాసం ఉంటున్నారు. అయితే, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ గాలికి వదిలేయడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మంచినీరు సరఫరా చేయడం లేదు. రెండు రోజులకోసారి మురుగునీరు సరఫరా అవుతున్నట్లు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అలాగే ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పేరుకు పోయి, మురుగు నిల్వ ఉంటోంది. చీకటిపడితే చాలు కొంతమంది ఆకతాయిలు మత్తుపదార్థాలు సేవించి దారిన వెళ్లే వారిని కత్తులతో బెదిరించి నగదు లాక్కుని వెళుతున్నారు. అదే విధంగా ఇంటి బయటపెట్టిన బైకులు, వాహనాల నుంచి పెట్రోలు, బ్యాటరీలు, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నట్లు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వీధి దీపాలు వెలగక పోవడంతో చిమ్మచీకటి అలుముకుంటోంది. అపార్ట్‌మెంట్లలో పైపుల నుంచి మురుగునీరు లీకేజీ అవుతోంది. ఇలా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఎవరికి చెప్పినా పట్టించుకోకపోవడంతో నివాసాలు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, టిడ్కో నివాసాల్లోని సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఈ నీరు తాగలేకున్నాం



మా కుళాయిల్లో రెండురోజులకోసారి మురుగునీరు సరఫరా చేస్తున్నారు. వాటితో స్నానం చేస్తే ఒళ్లంతా జిలపుట్టి దద్దుర్లు వస్తున్నాయి. ఆ నీరు తాగలేక శుద్ధిజలాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ వచ్చేనీరు కూడా సరిపోవడంతో లేదు.

- మాధవి, నెల్లూరు

ఎక్కడ మురుగు అక్కడే!



మా అపార్ట్‌మెంట్ చుట్టుపక్కల మురుగునీరు నిలిచిపోతోంది. మున్సిపల్ సిబ్బంది ఎవరూ రావడం లేదు. పందులు, దోమల బెడదతో అల్లాడిపోతున్నాం. కనీసం చెత్త కూడా తొలగించకపోవడంతో రోడ్లపై కుప్పలు కుప్పలుగా ఉంటున్నాయి.

- మాబున్నీ, నెల్లూరు


గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు


అపార్ట్‌మెంట్ ముందు పారుతున్న మురుగునీరు

కావలిలో రాత్రయితే భయం



కావలి : మద్దూరుపాడు వద్ద గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను అనేక పోరాటాల అనంతరం మొక్కుబడిగా కొందరికి కేటాయించారు కానీ వసతుల కల్పనలో అధికారులు చేతులెత్తేశారు. 2,112 గృహాలు నిర్మించగా, 350 కుటుంబాలు నివసిస్తున్నాయి. గృహసముదాయం చుట్టూ ప్రహరీ నిర్మించక పోవడం, చుట్టూ పొలాలు, గుంటలు, చెరువులు వాటి సముదాయంలో ముళ్ల చెట్లు, పొదలు ఉండటంతో ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది. వీధిలైట్లు వేయకపోవడంతో చీకటిపడితే విషపురుగుల బెడద ఎక్కువైంది. ఇటీవల ఒక గృహప్రవేశానికి వెళ్లిన బంధువుల్లో ఓ బాలుడు నీటి గుంటలో పడి మృతి చెందాడు. ఇక మంచి నీటి సరఫరా కూడా రోజుమార్చి రోజు అరకొరగా వదులుతుండటంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆహ్లాదం కోసం, శారీరక ధృడత్వం కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన జిమ్ పార్కు నిరుపయోగంగా మారింది. చెత్తాచెదారం కూడా పేరుకుపోయింది. మరోవైపు రేషన్ బండి రాకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ఇక వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్‌ను కూడా గతంలో ఎక్కడ ఉన్నారో అక్కడకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఎలాంటి సంక్షేమ పథకాలైనా వారి దగ్గరకు వచ్చే వారు లేరు. అధికారులు స్పందించి తమకు కనీస మౌలిక వసతులు సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



కందుకూరు : రాత్రయితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయం గా టిడ్కో గృహ సముదాయా లు మారిపోతున్నాయి. 90 శాతం ఇళ్లు ఖాళీగా ఉండటంతో మందుబాబులు, పేకాటరాయుళ్లు, గుర్తుతెలియని వ్యక్తుల కార్యకలాపాలకు ఈ గృహాలు వేదిక అవుతున్నాయి. మరోవైపు కూరగాయలు, నిత్యావసరాలు, తాగునీరు సైతం ఇక్కడ అందుబాటులో లేకపోవటంతో ఏ చిన్న అవసరం వచ్చినా కిలోమీటర్ల దూరంలోని పట్టణంలోకి పరుగులు తీయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. మరోవైపు గృహాల నిర్మాణంలోనూ అనేక అవకతవకలు జరిగినట్లు వెలుగుచూస్తున్నాయి. పైప్‌లైన్ల లీకేజీతో గోడల వెంట నీరు కారుతుండటమే గాక కొన్ని బ్లాకుల్లో శ్లాబుల్లోంచి కూడా నీటి చెమ్మ ఉరుస్తోంది. అంతర్గత డ్రైనేజి సిస్టమ్ కూడా సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు నిలిచే ఉంటోంది. కలుషిత నీటి సరఫరాతోపాటు వీధిలైట్లు కూడా సరిగ్గా ఉండటం లేదు.

ఆత్మకూరులో దాహం దాహం!

ఆత్మకూరు : మున్సిపాలిటీ పరిధిలోని 650 మంది లబ్ధిదారులకు 10నెలల క్రితం ఇళ్లను అప్పగించినా మౌలిక వసతులు కల్పించలేదు. టీడీపీ హయాంలో పేదల కోసం రూ.98కోట్లతో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి 1,056 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో భవన సముదాయాలకు గ్రహణం పట్టింది. మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులంతా ఇళ్లలో చేరడానికి సుము ఖత చూపలేదు. వారానికోసారి పైపులు లీకవుతుండ టంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యామ్నాయంగా మున్సిపల్ అధికారులు ట్యాంకర్లలో నీటిని సరఫరా చేసినా మూడు, నాల్గవ అంతస్తుల్లో ఉన్న వారు నీటిని తీసుకెళ్ల డానికి పడరానిపాట్లు పడుతున్నారు. రేషన్ బండి సకాలంలో రావడం లేదు. ఆహ్లాదం కోసం చేపట్టిన పార్కు నిర్మాణం పూర్తికాక ముందే లబ్ధిదారులకు ఇళ్లు అప్పజెప్పారు. ఉద్యానవనానికి కేటాయించిన స్థలం పిచ్చిమొక్కలతో నిండి ఉంది. టిడ్కో గృహ సము దాయం చుట్టూ ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు ఉండడంతో ఇళ్లలోకి పాములు, తేళ్లు విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఖాళీస్థలాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద తప్పడం లేదు. డ్రైనేజి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు చేరుతోంది.




ముగిసిన రంగడి బ్రహ్మోత్సవాలు
తెప్పపై విహరిస్తున్న రంగనాథుడు

నేత్రానందంగా తెప్పోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 31: నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, విద్యుత్ దీపాలం కరణ, పుష్పాలంకరణలు, బాణసంచా వేడుకల మధ్య తెప్పోత్సవం వైభవంగా సాగింది. దీంతో బ్రహ్మోత్స వాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన ఉభయ కర్తలు, సమన్వయ కమిటీ అధికారులు, ఆలయ ధర్మకర్తలు, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులుకు ఆలయ సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

- భక్తులకు నిరాశ

స్వామివారం తెప్పోత్సవాన్ని తిలకించాలని తరలి వచ్చిన భక్తులకు నిరాశే మిగిలింది. ఐదేళ్లక్రితం మాజీ మంత్రి పొంగూరి నారాయణ తెప్ప విహారాన్ని తిలకించేందుకు రంగనాథస్వామి ఘాట్‌కు అనుమతులు, నిధులు మంజూరు చేశారు. ఎంతమేర నిధులు వచ్చాయో అంత మేరకు పనులు చేసి కాంట్రాక్టర్ వెళ్లిపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధుల మంజూరును ఆపేసింది. దీంతో ఘాట్ పనులు నిలిచిపోయాయి. ఈ కారణంగా భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించలేకపోయారు. ఆలయం ఎదురుగా ఉన్న పాత ఘాట్‌లో ఏర్పాటు చేసిన తెప్పలోనే స్వామివార్లను ఆసీనులను చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

లావణ్య రామా.. కనులారా జూడవే!

- రసరమ్యంగా పాతంగి సోదరుల కచేరీ


కచేరీ చేస్తున్న పాతంగి సోదరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 31 : లావణ్య రామా కనులారా జూడవే.. అంటూ చెన్నైకి చెందిన సంగీత విద్వాంసులు పాతంగి సోదరులు, వారి బృందం చేసిన కచేరీ రసరమ్యంగా సాగింది. నగరంలోని టౌనుహాలులో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సంగీత ప్రదర్శనలు నిర్విరామంగా సాగాయి. జిల్లాలోని సంగీత గురువులు, వారి శిష్య బృందం త్యాగరాజస్వామి పంచరత్న ఘోష్టి, సంకీర్తనలు ఆలపించారు. వేదికపై వేంపు చేసిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ, త్యాగరాజ స్వాములకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి పాతంగి సోదరుల గాత్ర సంగీతం శ్రోతలను మైమరిపించింది. కార్యక్రమాన్ని భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి డాక్టర్ వై నాగదేవిప్రసాద్, డాక్టర్ ఎస్ సాయినాథ్, అన్నవరం సత్య నారాయణ, సభ్యులు పర్యవేక్షించారు.

నెల్లూరును అభివృద్ధి చేసి చూపిస్తా : వేమిరెడ్డి

విడవలూరు,మార్చి31 : టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, తనను గెలిపిస్తే నెల్లూరు పార్లమెంటును అభివృద్ధి చేసి చూపిస్తామని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అలగానిపాడు గ్రా మంలో ఆదివారం ఆయన కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు అసెంబ్లీకి తన సతీమణి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంట్‌కు తాను బీజేపీ, జనసేన బలపరచిన టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నామన్నారు. సీఎంగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు.

- టీడీపీలో చేరికలు

ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు చింతగింజల కృష్ణ నేతృత్వంలో వైసీపీ నాయకులు పొనుగోటి లక్ష్మీనారాయణ, చేపూరు జనార్దన్, గండవరపు శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధనరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, చెముకుల కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముదివర్తిలో దేవిరెడ్డి కృష్ణారెడ్డి,దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి, షేక్ రఫీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ముదివర్తిలో షాదీమంజిల్ అభివృద్ధికి, శ్మశానం మరమ్మతులకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ,బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అలగానిపాడు గ్రామసభలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఎన్‌డీఏతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 31: ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ తెలిపారు. ఎన్‌డీఏ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్, పొట్లూరు శ్రీనివాసులు, కిషోర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీకేపాడు రీచ్‌లో ఆగని ఇసుక దోపిడీ

• ఎన్నికల నియమావళి ఉల్లంఘన • సరిహద్దు దాటుతున్న ఇసుక



రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరుపుతున్న యంత్రం

అనంతసాగరం, మార్చి 31: మండలంలోని పడమటి కంబంపాడు రీచ్‌లో మళ్లీ ఇసుక తవ్వకాలు జోరందుకున్నాయి. ఎన్నికల నియమావళిని ఏమాత్రం పట్టించుకోకుండా అనుమతుల పేరుతో అధికార పార్టీ నాయకులు చేస్తున్న దోపిడీని చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. ప్రతిమ సంస్థ పేరుతో ఇసుక బిల్లులు ఇస్తూ రీచ్‌లో భారీ ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి ఇసుక తోడేస్తూ కాసుల పంటకు తెరలేపారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు మిన్నకుండిపోయారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత రెవెన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులు ఈ రీచ్‌ను సందర్శించి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేశారు. వారంరోజులు ఇసుక జోలికి వెళ్లని దోపిడీదారులు మళ్లీ రంగంలోకి దిగి మ్యానువల్ బిల్లు ఇస్తూ లారీలకు ఇసుక నింపి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే ఈ రీచ్‌లో నిబంధనలు ఉల్లంఘించి, హద్దులు చెరిపేసి పెద్ద ఎత్తున గోతులు చేయడంతో భూగర్భజలాలు తగ్గి సోమశిల, పడమటి కంబంపాడు, ఉప్పలపాడు, కమ్మవారిపల్లి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దాడులు : వాహనాల పట్టివేత

సోమశిల సమీపంలోని పడమటికంబంపాడు ఇసుక రీచ్‌లో ఆదివారం సాయంత్రం సెబ్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో అధికా రులు రీచ్‌ను సందర్శించారు. ఈ మేరకు నాలుగు హిటాచీ యంత్రాలు, ఏడు లారీలను స్వాధీ నం చేసుకొని సోమశిల పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడు ల్లో డిప్యూటీ తహసీల్దార్ గిరీష్, ఆర్ఐ రమేష్, విఆర్వో ప్రభాకర్ ఉన్నారు.

మినగల్లు రీచ్‌లో ఎన్నికల నిబంధనలకు నీళ్లు

● జగనన్న ఇళ్ల కోసం అంటూ ఇసుక అక్రమ రవాణా



మినగల్లు రీచ్‌లో ఇసుక లోడ్ చేసుకుని వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 31 : మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో శనివారం రీచ్ నిర్వాహకులు ఎన్నికల నిబంధనలకు నీళ్లు వదిలి ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టారు. విషయం తెలిసి పలువురు రైతులు, మీడియా అక్కడికి చేరుకోవడంతో ఇసుకలోడు చేసుకుని వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఓ లారీ, మరో ట్రాక్టర్‌తో పాటు ఇసుక లోడ్ చేసిన యంత్రాలను వెంటనే నిర్వాహకులు రీచ్‌లో నుంచి బయటకు తరలించేశారు. ఇసుక అక్రమ తవ్వకాలపై రీచ్ నిర్వాహకులు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులు కూపన్లు ఇచ్చారని, అందువల్ల యంత్రాలతో లోడ్ చేశామని చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలపై మైనింగ్ సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

వెంకటాచలం: వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిపై రెండు రోడ్డు ప్రమాదాలు జరగగా నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుండి గూడురుకు వెళ్లే మార్గంలో శనివారం రాత్రి మోటార్ బైక్, కారు ఢీకొని బైక్‌పై ఉన్న ముగ్గురు గాయపడ్డారు. అలాగే ఆదివారం ఉదయం అదే మార్గంలో గూడూరు వైపు వెళ్తున్న లారీలు ఢీకొనడంతో ఒక లారీ ముందు భాగం దెబ్బతింది. ఈప్రమా దంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రెండు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ దుకాణాల పేర్లు చెప్పి

అపరిచిత వ్యక్తుల ఫోన్‌పే దోపిడీ

పొదలకూరు, మార్చి 31 : పట్టణంలో ప్రముఖ దుకాణాల పేర్లు చెప్పి అపరిచిత వ్యక్తులు ఫోన్‌పే చేయించుకుని పరారైన సంఘటనలు పొదలకూరులో ఆదివారం చోటుచేసుకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. కొందరు అపరిచిత వ్యక్తులు కొంతమంది వద్దకు వెళ్లి పట్టణంలో ఉండే ప్రముఖ దుకాణాల పేర్లు, ఆయా యజమానుల పేర్లు, హాస్పిటల్ యజమానుల పేర్లు చెప్పి మిమ్మల్ని ఫోన్‌పే చేయమన్నారు... వారు తర్వాత ఇస్తారని నమ్మబలికి ఏడుగురు నుంచి ఫోన్‌పే చేయించుకుని పరారయ్యారు. ఇకనైనా ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి ఫోన్‌పే చేయమంటే సంబంధిత వ్యక్తికి ఫోన్‌చేసి నిర్ధారించుకున్న తర్వాతే మనీట్రాన్స్‌ఫర్ చేయాలి... లేదంటే మోసపోయే అవకాశం ఉంది. తస్మాత్ జాగ్రత్త.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సంగం, మార్చి 31: మక్తాపురంలోని ఓ మైనర్ బాలిక అదృశ్యం అయినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులతో పాటు శనివారం రాత్రి భోజనం తరువాత నిద్రించింది. ఉదయం నిద్ర లేచేటప్పటికి బాలిక కన్పించ లేదు. గ్రామంలోని బంధువులు, స్నేహితుల ఇళ్లు గాలించి ఆచూకీ తెలియలేదు. ఇటీవలే బాలిక పది పరీక్షలు రాసింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

అనంతసాగరం, మార్చి 31: స్థానిక పీర్‌సాహెబ్‌పేట వీధికి చెందిన ఎస్‌కే సుబహాని ఇంట్లో రెండురోజుల కిందట చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి బీరువాలోని రూ.2 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ విషయంపై బాధిత కుటుంబసభ్యులు అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీసీ కాలనీలో చోరీ

● నగదు, నగలు అపహరణ



బీరువా ధ్వంసం చేసి దుస్తులు చిందరవందర చేసి దొంగలు

మనుబోలు, మార్చి 31: స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంట్లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన ఆశం సుమన్, ఆయన భార్య అనూష, పిల్లలను తీసు కుని మోటార్‌సైకిల్‌పై ఉదయం కోటలో ఓ కార్యక్రమా నికి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేసరికి గేట్లు, తలుపులు పగులగొట్టి ఉండడంతో అవాక్క య్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న విలువైన పత్రాలు, రెండు సవర్ల బంగారు నగలు, రూ. లక్ష నగదు అపహరించుకు పోయినట్లు ఆశం సుమన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బ్యాంకు ఉద్యోగి ఇంట్లో...

నెల్లూరు(క్రైం), మార్చి 31: నెల్లూరులోని ఏసీ నగర్ పరిధిలో గల శ్రీనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం, సేకరించిన సమాచారం మేరకు... శ్రీనగర్‌లో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి అమరనాథ్ కుటుంబం నివసిస్తోంది. ఆయన శనివారం మధ్యాహ్నం కుటుంబంతో కలిసి గొలగమూడికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 25 సవర్లకుపైగా బంగారు ఆభరణాలను, వెండి ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. ఉదయం పనిమనిషి ఇంటిని శుభ్రం చేసేందుకు వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండ టంతో జరిగిన విషయాన్ని యజమానికి తెలియ జేసింది. ఆయన బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	272
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6502
వెండి కిలో ధర	రూ. 70,000
వెండి ఒక గ్రాము	రూ. 79.00

మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), మార్చి 31: అనధికార మద్యం విక్రయాలపై ఆదివారం బాలాజీనగర్ పోలీసులు దాడులు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని శెట్టిగుంటరోడ్డు వీవర్స్‌కాలనీకి చెందిన ఎం రమణయ్య అనధికారకంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నాడు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ తన సిబ్బందితో ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా రమణయ్య ఎన్‌టీఆర్ నగర్ ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతనివద్ద 15 క్వార్టర్ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నుడా నిధులు సీఎఫ్ఎంఎస్‌కే..!

• రూ.15 కోట్లకుపైగా బిల్లుల పెండింగ్
• లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు



నెల్లూరు (జడ్పీ), మార్చి 31: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వ సహకారం ఎక్కువగా ఉండాలి. స్థానికంగా వచ్చే నిధులను వాటికే వినియోగించుకోవడంతోపాటు అదనపు నిధులు అందించేలా ప్రభుత్వ తోడ్పాటు ఉన్నప్పుడే స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయి. నెల్లూరు జిల్లాలో ప్రత్యేక అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన నుడా నిధులను ప్రభుత్వం మింగేసి, కొత్తగా ఏర్పడిన నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)ని ఉత్సవ విగ్రహంగా మార్చింది. నుడా పరిధిలో ఏర్పాటు అయ్యే లేఅవుట్ల ఫీజుల సొమ్ము నుడాకు వస్తున్నందున జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్కులు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను కొంతకాలంగా చేస్తున్నారు. అయితే నుడా నిధులను సీఎఫ్ఎంఎస్‌కే మళ్లించడంతో నుడాలో పనులు చేయడం తప్ప బిల్లులు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

● రూ.15 కోట్లకుపైగా బకాయిలు

జిల్లాలోని 8 నియోజకవర్గాలకు నుడా పాలనను విస్తరించారు. అయితే పంచాయతీలకు, మున్సిపాలిటీలకు వచ్చే జనరల్ నిధులను ప్రభుత్వమే లాగేసుకుంది. దీంతో ఆయా శాఖల పరిధిలో ఐదేళ్లుగా అభివృద్ధి పనులు చేసే పరిస్థితి లేకుండాపోయింది. నుడాకి లేఅవుట్ల ఫీజులు వస్తుండడంతో 8 నియోజకవర్గాల పాలకులు నుడాపై దృష్టి పెట్టి దాదాపు రూ.50 కోట్ల మేర పనులు చేయించారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా తొలుత మంజూరు అవుతుండడంతో నుడా పనులు చేయించేందుకు కాంట్రాక్టర్లు ఎగబడ్డారు. అయితే స్థానిక సంస్థల జనరల్ ఫండ్‌తోపాటు ఆర్థిక సంఘం నిధులను లాగేసుకుంటూ వచ్చిన ప్రభుత్వం నుడాకు వచ్చే స్థానిక నిధులను రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని సీఎఫ్ఎంఎస్ ఖాతాకు ఇటీవల మళ్లించింది. దీంతో నుడా ఖజానాకు రావాల్సిన లేఅవుట్ల ఫీజుల సొమ్ము నేరుగా ప్రభుత్వ ఖాతాకు చేరుతుంది. గత ఆరు నెలల్లో దాదాపు రూ.10 కోట్లకుపైగా నిధులు సీఎఫ్ఎంఎస్ ఖాతాకు వెళ్లిపోగా, వాటికి సంబంధించిన బిల్లులను ఆ ఖాతాకే అప్లోడ్ చేసినప్పటికి నిధులను వాడుకుంటున్న ప్రభుత్వం బిల్లులను మాత్రం ఇవ్వడం లేదు. అలాగే మరో రూ.5 కోట్ల మేర పనులు ఇటీవల పూర్తి అయ్యాయి. వాటికి సంబంధించిన బిల్లులు కూడా ఇచ్చే పరిస్థితి నుడాలో లేకుండా పోయింది. దీంతో కాంట్రాక్టర్లు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లాది రూపాయల పనులకు తమచేత పెట్టుబడి పెట్టించి పనులను చేయించి బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. నుడా సొమ్మును నుడాకి ఇవ్వకుండా ప్రభుత్వం లాగేసుకోవడం దుర్మార్గమని కాంట్రాక్టర్లు అంటున్నారు.

● ఆగిన పనులు

నుడా పరిధిలో పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్తగా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దాదాపుగా రూ.7 కోట్ల పనులకు టెండర్లు పూర్తి అయినా ఆ పనులను చేసే సాహసాన్ని వారు చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, ఆ పనులన్ని ప్రారంభం కాకుండా ఆగిపోయాయి.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

• ఈనెల 8 వరకు నిర్వహణ
• జిల్లాకు 1,80,393 సమాధాన పత్రాలు
• విధుల్లో 1,599 మంది సిబ్బంది

నెల్లూరు (విద్య), మార్చి 31 : పదో తరగతి సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసేందుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. నెల్లూరు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం (నేటి) నుంచి ఈనెల 8వ తేదీ వరకు మూల్యాంకనం నిర్వహించనున్నారు. వివిధ జిల్లాలకు చెందిన 1,80,393 లక్షల సమాధాన పత్రాలు జిల్లాకు చేరడంతో వీటిని మూల్యాంకనం చేసేందుకు విద్యాశాఖ 1,599 మంది సిబ్బందిని నియమించింది. చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్‌లు మూల్యాంకన విధులు నిర్వహించనున్నారు. వీరిలో కొంతమంది వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరు కాలేకపోతుండడంతో వారి వద్ద నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకుని, వారి స్థానంలో మరొకరి నియమించే ఏర్పాట్లు చేస్తున్నారు.

● సెలవుల్లేవు..

వాల్యుయేషన్‌కు హాజరయ్యే సిబ్బందికి ఈనెల 8వరకు సెలవులను రద్దు చేశారు. విధులకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కచ్చితంగా హాజరు కావాల్సిందేనని అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8.45 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 40 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుంది.

● సీసీ కెమెరాల ఏర్పాటు

సిబ్బంది పనితీరు, మూల్యాంకనం చేసే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు అనుసంధానం చేశారు. ఉపాధ్యాయులు విధులు నిర్వహించక పోయినా, గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నా సీసీ కెమెరాల ద్వారా గుర్తించనున్నారు. విధుల్లో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్‌లను కూడా అనుమతించబోమని, ఒకవేళ మొబైల్‌లో మాట్లాడుతూ కనిపిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. మూల్యాంకన కేంద్రంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో రామారావు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి

● ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నెల్లూరు (హరనాథపురం): బ్యాంకు ఉద్యోగుల కు పాత పింఛను విధానం (ఓపీఎస్) అమలు చేసి పెన్షన్ అందచేసేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నెల్లూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. రాంబాబు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని, ఉద్యోగుల డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉదయ్‌కుమార్, రమణప్రసాద్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



నెల్లూరు : బిషప్ హౌస్‌లో క్రీస్తు పునరుత్థానం సెట్టింగ్



కొవ్వొత్తులు పట్టుకుని ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 31 : జిల్లాలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే రోజు శిలువ మరణం పొందిన ఏసుప్రభువు అనంతరం మూడవ రోజు ఆదివారం పునరుత్థానం సందర్భంగా ఏటా ఈ పండుగ జరుపుకుంటారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి వరకు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల లోనూ ప్రత్యేక ప్రార్థనలతోపాటు స్తుతిగీతాలను ఆలపించారు. విందులు నిర్వహించారు. నెల్లూరులోని బిషప్‌హౌస్‌లో ఈస్టర్ సంబరాలు అంబరాన్ని అంటాయి. బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థానం సెట్టింగ్ ఏర్పాటు చేశారు. సామూహికంగా కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. జిల్లాలోని అన్ని చర్చిలలోనూ వేడుకలు జరిగాయి.



రామస్వామిపాలెం గిరిజన కాలనీలో రేషన్ పంపిణీ వాహనం

రేషన్ పంపిణీ వాహనాలపై తొలగని వైసీపీ రంగులు

● ఆచరణకు నోచని ఎన్నికల నిబంధనలు

బిట్రగుంట, మార్చి 31: బోగోలు మండలంలో అధికారులు సార్వత్రిక ఎన్నికల నిబంధనలు గాలికి వదిలేశారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాన్ని ప్రచారం కోసం ఉంచినట్లు ఆదివారం దర్శనమిచ్చింది. ఆ వాహనంపై జగన్ బొమ్మ, వైసీపీ రంగులు తొలగించపోవడం ఎన్నికల ఉల్లంఘన కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నెల్లూరు (విద్య), మార్చి 31 : ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ పోటీల్లో భాగంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి స్పై మార్షల్‌ఆర్ట్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-14 ఫైట్ విభాగంలో కే అక్షయలక్ష్మి, సమీర బంగారు పతకాలు సాధించారు. కటా విభాగంలో ఎం చష్మిత రజత పతకం, కే అన్విత కాంస్య పతకం దక్కించుకున్నారు. యారో విభాగంలో మోషిత బంగారు, అండర్-17 ఫైట్ విభాగంలో వై ప్రతిమ బంగారు పతకాలు సాధించినట్లు జిల్లా స్పై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి పీ ఆదినారాయణ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఆ క్రీడాకారులను సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇబ్రహీం, జిల్లా సంయుక్త కార్యదర్శి కే శ్రీకాంత్, కోచ్ సత్య అభినందించారు.

సోమశిలలో 9.845 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 31: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి ప్రాజెక్టులో 9.845 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 920, దక్షిణ కాలువకు 250 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సెబ్ అధికారులపై వైసీపీ నేతల దౌర్జన్యం

● మద్యం కేసులో నిందితుడిని వదిలిపెట్టాలని డిమాండ్



సెబ్ అధికారులపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నేతలు

మర్రిపాడు, మార్చి 31 : బెల్టు షాపునకు అక్రమంగా మద్యాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని పట్టుకున్న సెబ్ అధికారు లపై వైసీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. ఈ సంఘ టన ఆదివారం మర్రిపాడులో చోటుచేసుకుంది. మర్రిపాడు లోని మద్యం దుకాణం నుంచి పడమటినాయుడుపల్లికి చెందిన సుబ్బయ్య 10 మద్యం సీసాలు తీసుకుపోతుం డగా, ఉదయగిరి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నా రు. అనంతరం సుబ్బయ్యను పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్తుం డగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు అక్కడికి చేరు కొని మండలంలో అన్నీ బెల్టు షాపులను మూపించండి. ఆ తర్వాత మా వాడిని పట్టుకోండని అన్నారు. కాగా రెండు మద్యం సీసాలను పగలకొట్టి తమపైకి దౌర్జన్యానికి వచ్చారని సెబ్ సీఐ వెంకట రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన్నే రామ్‌గోపాల్‌రెడ్డి అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బయ్యపై ఉదయగిరి సెబ్ సీఐ కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఆత్మకూరు సీఐ వేణు సంఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. వైసీపీ నేతలపై కేసు నమోదు చేయవద్దంటూ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నుంచి పోలీసులకు ఫోన్‌లు వచ్చినట్లు తెలిసింది.

రేపు బ్రాహ్మణక్రాకలో టీడీపీ రోడ్‌షో

జలదంకి, మార్చి 31 : మండలంలోని బ్రాహ్మణక్రాకలో ఈనెల 2 తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ రోడ్‌షోలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థులు కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొననున్నారు. బ్రాహ్మణక్రాక పంచాయతీ పరిధిలోని 9వ మైలు వద్ద సాయంత్రం 4గంటలకు రోడ్‌షో ప్రారంభమై బి.కె.అగ్రహారం మీదుగా బ్రాహ్మణక్రాక వరకు కొనసాగనుంది. అనంతరం బ్రాహ్మణక్రాకలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరై విజయవంతం చేయాలని మండల నాయకులు కోరారు.

పెన్షన్లు ఆలస్యం !

• ఈనెల 3 నుంచి పంపిణీ
• వారం రోజులుగా వైసీపీ నేతల ప్రచారం
• జాప్యాన్ని టీడీపీపైకి నెట్టే ప్రయత్నం
• పైగా బ్యాంకులకు సెలవులంటూ సాకు
• శని, ఆదివారాల్లో పనిచేసిన బ్యాంకులు
• రంగంలోకి గృహ సారథులు



నెల్లూరు(హరనాథపురం), మార్చి 31 : ప్రతినెలా ఒకటో తేదీన ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీకి ఈనెలలో బ్రేక్ పడింది. 1వతేదీ కాకుం డా 3నతేదీ పెన్షన్లను పంపిణీ చేయిస్తా మని వారం నుంచి వైసీపీ నేతలు, అధికారు లు చెబుతూ వస్తున్నారు. ఇందుకు కారణం శని, ఆదివారాల్లో బ్యాంకుల పని చేయవని నమ్మబలికారు. అయితే వాస్తవానికి శని, ఆది వారాల్లో బ్యాంకులు పనిచేశాయి. ప్రభుత్వం సకాలంలో పింఛన్లను పంపిణీ చేయించాలనుకుంటే గురువారమే నగదు డ్రాచేయించి, సోమవారం నుంచి పంపిణీ చేయించవచ్చు. పైగా ఈ ఆలస్యానికి కారణా న్ని టీడీపీపైకి నెట్టే ప్రయత్నాలను అధికారపార్టీ నేతలు ప్రారం భించారు.

వలంటీర్ల ముసుగులో గృహసారథులు

సంగం : ఎన్నికల సంఘం వలంటీర్లపై కొరడా ఝుళిపించింది. పింఛన్ల పంపిణీకి వారిని దూరం పెట్టింది. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన వైసీపీ వలంటీర్ల స్థానంలో గృహసారథులను రంగంలోకి దించి లబ్ధి పొందాలని చూస్తోంది. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు గృహసారథుల వద్ద సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం వీరి ద్వారా ఎన్నికల తాయిలాల పంపిణీ, ప్రచారానికి దిగుతున్నట్లు తెలుస్తోంది.

● ఎన్నికల నిబంధనలతో జాప్యం

గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి పథకాలు, పెన్షన్, నగదు పంపిణీ చేయకూడదని కూడా స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్‌తోపాటు ఇతర పరికరాలను కలెక్టర్ల వద్ద డిపాజిట్ చేయించాలని ఆదేశించింది. దీంతో వైసీపీ నేతల గొంతులో వెలక్కాయి పడ్డట్లు అయింది. టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు వల్లే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీని ఈసీ నిలిపివేసిందనే ప్రచారానికి వైసీపీ నేతలు పూనుకున్నారు.

● సచివాలయాల్లో పంపిణీ

ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పెన్షన్ పంపిణీ చేస్తారు. లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 3 నుంచి 8వ తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలియచేశారు. గ్రామ సచివాలయాల్లో పంచాయితీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంటు పెన్షన్ నగదు డ్రా చేసి పెన్షన్‌దారులకు పంపిణీ చేస్తారని, పట్టణాల్లో సచివాలయ అడ్మిన్ పంపిణీ చేస్తారని అధికారులు చెబుతున్నారు.

టీడీపీపై నెపం నెట్టేందుకే...

కావలి రూరల్ : గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులే పింఛన్లను పంపిణీ చేసేవారు. నాడు ప్రతి పంచాయతీలో 10 మంది వరకు పనిచేసేవారు. కాగా ప్రస్తుతం వలంటీర్ మాదిరిగానే సచివాలయ సిబ్బంది కూడా ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ చేయటం పెద్దకష్టమేమీకాదు. కానీ లబ్ధిదారులను సచివాలయాల చుట్టూ తిప్పి అక్కడ పెన్షన్ ఇప్పిస్తే, వారి కష్టాలకు కారణం టీడీపీ, ఇతర పక్షాలేనని ఆరోపించే పనిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు.

రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు..



- రాష్ట్ర పాలనకు చంద్రబాబు డ్రైవర్‌గా పనిచేస్తానడం హర్షణీయం
- వింజమూరు ప్రజాగళం విజయవంతంపై ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు
- ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్

విలేకరులతో మాట్లాడుతున్న ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 31: జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రాతియుగంగా మారిందని.. సార్వత్రిక ఎన్నికల అనంతరం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో ఆధ్వర్యంలో స్వర్ణయుగం రానుందని ఉదయగిరి ఉమ్మడి ఎ మ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వి లేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వర్ణయుగ పాలన సాగించేందుకు నారా చంద్రబాబునాయు డు డ్రైవర్ పనిచేస్తానని చెప్పడం హర్షణీయమని అని కొనియాడారు. ప్రజల చైతన్యం కోసం తలపెట్టిన ప్రజాగళం సభను విజయవంతం కావడంతో ప్రతిఒక్కరికీ ఆయన పేరుపేరున ధన్యవాదాలు చెప్పారు. పోలీస్, వివిధ శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృ ద్ధి చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబును ముఖ్య మంత్రి చేసుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఉదయగిరి కోటపై టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయ మని, చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. టీడీపీ జనసేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: తోటలచెరువుపల్లిలో ఆదివారం రాత్రి ముస్లింలకు నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జన సేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురే ష్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాం క్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీ నర్ చంద్ర మధుసూదన్‌రావు, నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మె ల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దుత్తలూరులోని బూత్ నంబర్ 104పరిధిలో ఆదివారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం సూచన మేరకు చేపట్టిన కార్యక్రమం లో మాజీ జెడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, యూనిట్ ఇన్‌చార్జి కాకర్ల మధుసూదన్‌రెడ్డి, లింగాల వెంకటేశ్వరరెడ్డి, సింగవరపు సుబ్బారెడ్డి, చల్లా ప్రసాద్, కందుకూరి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



దుత్తలూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

- చర్చిలు, పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

లింగసముద్రం, మార్చి 31: మండలంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే నాడు ఏసుక్రీస్తు ప్రజలను పాపాల నుంచి విముక్తి చెందడం కోసం శిలువపై చనిపోతారు. మూడోరోజైన ఆదివారం క్రీస్తు సమాధి నుంచి లేచి వస్తారు. క్రీస్తు చనిపోయి తిరిగి వచ్చిన రోజును క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా ఆదివారం శింగరపాలెం, లింగసముద్రం, వీఆర్ కోట, పెదపవని, చినపవని, పెంట్రాల, మొగిలిచెర్ల గ్రామాలతో పాటు పలు గ్రామాలలో క్రైస్తవులు చర్చిలకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రతిఒక్కరూ సాటి మనిషి పట్ల ప్రేమ, జాలి, క్షమగుణం కలిగి ఉండాలన్నారు.

వలేటివారిపాలెం: క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని పాస్టర్ సామేలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలోని చర్చీలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. వలేటివారిపాలెం లోని చర్చీలో పాస్టర్ సామేలు పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

బిట్రగుంట: మండలంలోని చర్చిల్లో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బోగోలు ఆర్సీఎం చర్చి ఆవరణలో ఫాదర్ బీపాల్ ఏర్పాటు చేయించిన ఏసుక్రీస్తు పునరుత్థాన దృశ్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన ఫాదర్లు న్యావీకుమార్, డాన్‌బోస్కో పాల్గొన్నారు.



ఉదయగిరి ఏబీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నందిపాడు, పాపంపల్లి, రెడ్లదిన్నె, ఏరుకొల్లు, కొత్తపేట, దుత్తలూరు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పర్వదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.

ఉదయగిరి: వెంగళరావునగర్, గన్నేపల్లి, గండిపాళెం, సర్వరాబాదు, బోడబండ, ఉదయగిరి చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం పూర్వీకుల సమాధుల ప్రార్థనలు జరిపారు. ఉదయగిరిలోని చర్చిల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డిలు పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

అత్యధిక మెజార్టీతో ఆనం విజయం తథ్యం



పేరారెడ్డిపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, మార్చి 31: నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, సాగునీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాదాల మస్తానయ్యనాయుడు జోస్యం చెప్పారు. ఆదివారం పేరారెడ్డిపల్లిలో టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరప త్రాలను పంపిణీ చేసి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశ పెట్టబోయే సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. టీడపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి గడువు పెంపు

ఉదయగిరి రూరల్, మార్చి 31: ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా గురుకుల విద్యాలయాల కన్వీనర్ జీ.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8,వ తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష 25న ఉం టుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి, మార్చి 31: నియోజకవర్గంలోని దివ్యాంగులు, 85ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12డీ దరఖాస్తు సమర్పించాలని ఆదివారం నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజారమేష్‌ప్రేమ్ కుమార్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా దివ్యాంగుల హక్కుచట్టం 2016 సెక్షన్2 కింద సంబంధిత అధికారి ధ్రువీకరించిన సదరన్ సర్టిఫికెట్ కనీసం 40 శాతం వైక ల్యం కలిగి ఉండాలన్నారు. దానికి 12డీ దరఖాస్తుతో జత చేయాలన్నారు. సీనియర్ సిటిజన్లు 85ఏళ్లు దాటిన ఓటర్లు వయసు ధ్రువీకరణపత్రం జత చేయాల్సి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి పత్రాలను ధ్రువీకరించి అర్హులైన ఓటర్ల ఇళ్లను సందర్శిస్తారన్నారు. ఫారం-12డీలో సరైన వివరాలు ఉన్న ఓటర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ జారీ చేస్తామన్నారు. నియోజకవర్గంలో 2,39,646మంది ఓటర్లు ఉండగా 1,411 మంది సీనియర్ సిటిజన్లు, 4,549 మంది దివ్యాంగులు ఉన్నారని పేర్కొన్నారు.

'సదరన్' నమోదుకు అవకాశం

ఉదయగిరి, మార్చి 31: ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో సదరన్ నమోదుకు అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదివారం తెలిపారు. ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి ఈనెల 8వ తేదీ నుంచి వైద్యశాలల్లో స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని 194 మంది వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంటామన్నారు.

కొద్దిరోజులు ఓపికపట్టండి.. మీ సమస్యలు తీరుస్తా !

- కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ



నూకనపల్లిలో టీడీపీలో చేరిన వారితో లక్ష్మీసాయిప్రియ

కలువాయి, మార్చి 31: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు.. ఇక 44 రోజులు ఓపిక పట్టండి మన ప్రభుత్వం రాగానే మీ సమస్యలను తీరుస్తానని వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం నూక నపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. తాగునీరు, రోడ్ల సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యలను డైరీలో అక్కడే రాసుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె ఇంటింటికి తిరిగి ప్రజలను అభ్యర్థించారు. చంద్రబాబు నాయుడు సీఎం చేసుకుని ఈ రాష్ట్రం బాగుచేసుకుందామని ప్రజలను కోరారు.

టీడీపీలో పలువురి చేరిక

టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయి ప్రియ సమక్షంలో నూకనపల్లి మాజీ సర్పంచ్ చల్లా మమత భర్త రాధాకృష్ణారెడ్డి, మాజీ సర్పంచు నరికే శ్రీనివాసులు, జిలానీ వారి అనుచరులు 50మందికి ఆమె టీడీపీ కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. మొదటిసారిగా గ్రామానికి వచ్చిన లక్ష్మీసాయిప్రియకు నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లునాయడు, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, కండే ప్రసాద్, ముక్కు కృష్ణయ్య, సుభాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు !

- కనిపించని హెచ్చరిక బోర్డులు ● తరుచూ ప్రమాదాలు



గానుగపెంటపల్లి మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలు

ఉదయగిరి, మార్చి 31: గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఉదయగిరి నుంచి గండిపాళెం వెళ్లే మార్గంలో గానుగపెంటపల్లి, సున్నవారిచింతల, వెంగళరావునగర్ ప్రాంతాల్లో మలుపులు ఉన్నాయి. కొన్నిచోట్ల రోడ్లకిరువైపులా కంపచెట్లు కమ్ముకొని ఎదురుగా వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గానుగపెంటపల్లి మలుపు వద్ద రోడ్డుకిరువైపులా పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉంది. సర్వరాబాదు, వెంకట్రావుపల్లి, గడ్డంవారిపల్లి, కుర్రపల్లి, కృష్ణంపల్లి, ఆర్లపడియ, కోటాయపల్లి, పెద్దిరెడ్డిపల్లి, కుర్రపల్లి నుంచి పుల్లాయపల్లి, అన్నంపల్లి, బిజ్జంపల్లి, చెరువుపల్లి, చెర్లోపల్లి, సంజీరాజుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నిరోధించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నాగారప్పమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 31: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారప్పమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పదవీ విరమణ హెచ్‌ఎంకు సన్మానం

సంగం, మార్చి 31: పదవీ విరమణ చేసిన వెంగారెడ్డిపాలెం హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరయ్యను ఉపాధ్యాయులు ఆదివారం పాఠశాలలో శాలువ, పూలమాలతో సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంఈవో -2 మల్లయ్య, ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్, నరసయ్య, రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం ఈశ్వరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

కలిగిరి : సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలని లోక్‌అదాలత్ సభ్యుడు ఎమ్.మాలకొండారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోర్టుకు రాని పెండింగ్ కేసుల తుది తీర్పును లోక్‌అదాలత్‌లో ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఐదేళ్లుగా డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించలేదు

కందుకూరు, మార్చి 31: కందుకూరు పట్టణంలో డంపింగ్‌యార్డు కాలుష్య సమస్యను ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం, అధికారులు పరిష్కరించలేదని, రాబోయే టీడీపీ ప్రభుత్వంలో వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని గుర్రంవారిపాలెం సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంపింగ్‌యార్డులో నిప్పుపడి రెండు రోజులుగా పట్టణం మీదకు పొగ వెదజల్లుతూ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నా అధికారులకు పట్టడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు గ్రామాల ప్రజలు టీడీపీలో చేరిక

పలు గ్రామాలకు చెందిన వారు ఆదివారం వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చేరిన వారందరికీ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని పొర్లుకట్టసంఘానికి చెందిన పలు ఎస్టీ కుటుంబాల వారు పోలుబోయిన శ్రీనివాసులు, మల్లవరపు వెంకటరావుల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే వీరేపల్లికి చెందిన పలు ఎస్టీ కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కందుకూరు మండలం పాలూరు గ్రామానికి చెందిన వల్లంరెడ్డి చంద్రారెడ్డి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా ముస్లింల ఆహ్వానం మేరకు ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి పట్టణంలోని కోటకట్ట వీధిలో ఉన్న జామియా మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, సూరే వినోద్ కుమార్‌రెడ్డి, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఆళ్ల హరికృష్ణారెడ్డి, గోనుగుంట వీరబ్రహ్మం, లక్కంరాజు నరేష్, సుధాకర్, వర్మ, షేక్ మున్నా, రూబీ తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : చాగొల్లులో టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

చాగొల్లులో 50 కుటుంబాలు...

ఉలవపాడు : మండలంలోని చాగొల్లుకు చెందిన 50 కుటుంబాలు ఆదివారం రాత్రి వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కడియాల సుబ్బారావు, కారసాల శ్రీనివాసులు, వల్లూరి ప్రసాద్, గ్రామ వైసీపీ ఉపాధ్యక్షురాలు గుంజి రమణమ్మలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరారు. వీరితోపాటు మరికొందరు జనసేనలో చేరగా వీరందరికి ఇంటూరి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని, చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలని, తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ఏమి చేశారని ఎమ్మెల్యేకి ఓటేయాలంటున్న ప్రజలు

- వెంగళరావునగర్‌లో కావ్య ఇంటింటి ప్రచారం



18వ వార్డులో ప్రచారం చేస్తున్న కావ్య

కావలి, మార్చి 31 : పదేళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాంతానికి ఏమి చేశారని మళ్లీ ఓటేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ 18, 23వ వార్డులలో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, మీ బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కావలి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపాంచాలని కోరారు. రెండు దఫాలు ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకుంటే దొరికిన కాడికి దోచుకోవటం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మళ్లీ ఆయనకు ఓటేస్తే ఇంకా ఏదైనా మిగిలి ఉంటే దోచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు ఇన్‌చార్జిలు వర్థినేని వెంకటేశ్వర్లు, శానం హరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల నిర్వాహకుడు

కావలి, మార్చి 31: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం మండలంలోని రుద్రకోట అయ్యప్ప దేవాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిరెడ్డి, కార్యదర్శిగా ఎం.ఆనందరావు, కోశాధికారిగా దీననాథ్, పీఆర్వోగా జి.చిరంజీవి, వలంటరీ కెప్టెన్‌గా జి.గిరిబాబులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప దేవస్థానం ఛైర్మన్ ఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకాగా కె. బ్రహ్మయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రచారసభ రాష్ట్ర కార్యదర్శి శంకరాచారి, బాధ్యులు నాగేశ్వరరావు, కె.మాల్యాద్రి, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి



ఇంటింటా ప్రచారంలో బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, మార్చి 31 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని వైకుంఠపురం, అంజయ్యనాయుడు కాలనీల్లో ఆదివారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్య, పచ్చబట్ల సురేంద్ర, జగన్, నజీర్‌బాషా, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూవో పెంచలయ్యకు ఉద్యోగ విరమణ సత్కారం



పెంచలయ్యను సత్కరిస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారులు

కావలిటౌన్, మార్చి 31: సాంఘిక సంక్షేమ శాఖ కావలి సహాయ సంక్షేమ అధికారి కాబాక పెంచలయ్యను ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం స్థానిక జనతాపేటలోని కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కారించారు. సిబ్బంది, కుటుంబ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏబీసీడబ్ల్యూలు సుధాకర్, కుందుకూరి బ్రహ్మానందచారి, హజరత్తయ్య, ఏఎస్‌డబ్ల్యూలు, వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు నవోదయ సీట్లు



బీ రోహిత్



బీ మోక్షిప్రసాద్



ఏ వరుణ్‌దీప్



పీ భానుప్రతాప్



మణిదీప్

కలువాయి, మార్చి 31: నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి మండలం నుంచి ఆదివారం ఐగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కలువాయిలోని విశ్వం పాఠశాలకు చెందిన బి.రోహిత్, బి.మోక్షిప్రసాద్, ఏ.వరుణ్‌దీప్, పి.భానుప్రతాప్‌లు అలాగే పెరంకొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏ.మణిదీప్ ఉన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయలు అభినందించారు.

'లుంబిని' విద్యార్థుల ప్రతిభ

చేజర్ల, మార్చి 31: నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో చేజర్లలోని లుంబిని విద్యాలయానికి చెందిన జి.పూజిత, ఎల్.మహేష్‌లు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పలుకూరులో ఇంటింటి ప్రచారం

కందుకూరు, మార్చి 31: మండలంలోని పలుకూరు గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, వివిధ కమిటీల బాధ్యులు, మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాజేష్ కార్యాలయంలో నేడు హోమం



ప్రత్యేక పూజలలో పాల్గొన్న ఇంటూరి రాజేష్

కందుకూరు, మార్చి 31: నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు నిండుగా ఉండాలని ఆకాంక్షిస్తూ టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ ఆదివారం తన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం హోమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి చరిత్ర సృష్టిస్తా : పసుపులేటి

కావలిటౌన్, మార్చి 31: కావలిలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి చరిత్ర సృష్టిస్తానని పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం పీఎస్సార్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రధాన పార్టీలు తన ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూ అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. శనివారం రాత్రి ట్రంకురోడ్డులో తాను తన అనుచరులతో కలిసి ప్రచారం చేసుకుంటుంటే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు పాల్గొన్న కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు తన వాహనానికి ఇరువైపుల వారి వాహనాలు పెట్టి రౌడీయిజం చేస్తుంటే ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు. సమావేశంలో ఫైనంపాటి జగదీష్, కోట వెంకట్, కుడుముల సుధాకర్, గాదంశెట్టి మల్లికార్జున, తిరుపతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దగదర్తిలో బైక్ ర్యాలీ

దగదర్తి(బిట్రగుంట), మార్చి 31: దగదర్తిలో ఆదివారం ఎంపీపీ తాళ్లూరు వెంకటకృష్ణప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ర్యాలీలో పాల్గొన్నారు. సున్నంబట్టి నుంచి దగదర్తి వరకు ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో సుకుమార్‌రెడ్డి, మహేష్‌నాయుడు, కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన నేతల ప్రచారం

బిట్రగుంట, మార్చి 31: బోగోలు మేజర్ పంచాయతీ యాదవపాలెం, పాత హరిజనవాడ, అరుంధతివాడలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలకు మద్దతుగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ముంతాల వెంకయ్య, నాగరాజు, బీజేపీ, టీడీపీ మహిళా నేతలు ఎన్.రాజ్యలక్ష్మీ, జీ.అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కొండాపురం, మార్చి 31: మండలంలోని ఉప్పలూరు పంచాయతీలో ఇటీవల మరణించిన మార్లాల ప్రసాదరావు కుటుంబాన్ని టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్, సర్పంచు వల్లేటి కొండలరావులు ఆదివారం పరామర్శించారు. అలాగే గుడవల్లూరు పంచాయతీలో ప్రమాదానికి గురైన బోయళ్ల చెంచయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పోలినేని రమేష్, చెరుకూరు వెంకటాద్రి, చల్లా చినమాలకొండయ్య పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

సంగం, మార్చి 31: జండాదిబ్బలో సహారా ఎడ్యుకేషన్ రూరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఎస్థాని బాషా దాతల సహకారంతో ఆదివారం పేద ముస్లిం మహిళలకు చీరలు, సేమియా, చక్కెర తదితర నిత్యావసరాలు అందజేశారు. అందుకు సహకరించిన దాతలకు సహారా ఎడ్యుకేషన్ రూరల్ సొసైటీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల ఫోన్ల స్వాధీనం

చేజర్ల, మార్చి 31: గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను ఆదివారం ఎంపీడీ కరీముల్లా స్వాధీనం చేసుకున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ చేయవద్దన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారి వద్ద ఉన్న ఫోన్లను తీసుకుని ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

వివాదరహిత 'కోవూరు'గా తీర్చిదిద్దుతా : ప్రశాంతిరెడ్డి



విడవలూరు : మసీదులో ప్రార్థనలు చేస్తున్న వేమిరెడ్డి దంపతులు



కోవూరు : ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి

విడవలూరు, మార్చి 31: కోవూరు నియోజకవర్గాన్ని వివాద రహిత నియోజకవర్గంగా మారుస్తానని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముదివర్తిలో ఆమె ఆదివారం టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును ఎన్నుకోవాల్సిందిగా కోరారు. రంజాన్ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, షేక్ రఫీ, చెముకుల శ్రీని వాసులు, ఇమాంబాష తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్ళదిబ్బలో..

కోవూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి ఆదివారం స్థానిక గుమ్మళదిబ్బ కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తన తల్లి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాల్సిందిగా కోరారు. ఆమె వెంట దివ్యారెడ్డి, రూపారెడ్డి, కిరణ్, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, యాకసిరి వెంకట రమణమ్మ బీజేపీ నాయకులు గాదిరాజు చక్ర వర్తి, తదితరులున్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యం

కొడవలూరు: ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ గుండాలమ్మపాళెం, రెడ్డిపాలెంల్లో టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, బద్వేల్ వినీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేయండి



వీరంపల్లిలో ప్రత్యేక బలగాల కవాతు

మనుబోలు, మార్చి 31: రాబోయే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఎలాంటి భయం, ఆందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా వేయవచ్చునని పొదలకూరు సీఐ రాంబాబు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మడమనూరు, వీరంపల్లి పంచాయతీల్లో ఆదివారం బిఎస్ఎఫ్ జవాన్లతో కలిసి. మనుబోలు సివిల్ పోలీసులు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు ఎస్ఐ. అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా పింఛన్లు

మనుబోలు, మార్చి 31: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ నెల సామాజిక పింఛన్లు సచివాలయ సిబ్బంది ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జీవిఎస్‌వి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 8 వరకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 31: మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహం, పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన నైపుణ్య శిక్షణ

● పెరుగుతున్న నిరుద్యోగం

పొదలకూరు, మార్చి 31: వైసీపీ అధికారంలోకి వచ్చాక నైపుణ్య శిక్షణ కుంటుపడడంతో నిరుద్యోగులు పెరుగుతున్నారు. గత ప్రభుత్వం చదువుతోపాటు నైపుణ్యాలను పెంచేందుకు డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను అందించేది. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్లను తీసుకొచ్చింది. చివరి ఏడాది చదువుతుండగానే తరగతులు పూర్తిచేసి, సంబంధిత ధ్రువపత్రాలు అందజేసేది. అనంతరం బహుళజాతి సంస్థల్లో కొలువులకు అవకాశం కల్పించేది. ప్రస్తుతం ఈ ప్రక్రియలన్నీ ఆగిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో పదుల సంఖ్యలో ఉద్యోగాలు పొందారు. అనంతరం కొన్ని నెలలకే శిక్షణ ఆపేశారు. గతంలో పొదలకూరులోని మూడు డిగ్రీ కళాశాలల్లో రోజుకు మూడు గంటల వ్యవధిలో ఆన్‌లైన్‌లో కోర్సులు సాగేవి. ఈమేరకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేకంగా కంప్యూటర్లు సమకూర్చారు. ప్రతిరోజు సుమారు 2గంటల పాటు తరగతులు సాగేవి. అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్ డిజిటల్ మార్కెటింగ్, అమెజాన్ వెబ్‌సర్వీస్, లాంచ్ పాడ్ ఎస్ఎస్ఈ, సైబర్ సెక్యూరిటీ, అప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఏడబ్ల్యూఎస్, ఈకోడమ్, ఎంఎస్ఆఫీస్, ట్యాలీ విత్ జీఎస్టీ, తదితరాలపై అవగాహన కల్పించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక శిక్షణ కుంటుపడింది. ఈలోపు కోవిడ్ రావడంతో పూర్తిగా మందగించాయి. గతంలో శిక్షణ పొందిన వారిలో కొందరికి ఉద్యోగాలు దక్కాయి. 2021-22లో పునఃప్రారంభానికి చర్యలు చేపట్టినా కొలువులు కల్పించలేకపోయారు. అనంతరం ఆపేశారు. గతంలో శిక్షణ పూర్తయిన వారి వివరాలు ఏపీఎస్ఎస్ఈసీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వద్ద ఉండేవి. మేళాలు నిర్వహించి, వారికి అవకాశం కల్పించేవారు. తద్వారా కొలువుల కల్పన సులభతరమయ్యేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడంలేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోపిడీ రాజకీయాలకు చరమగీతం : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, మార్చి 31: దోపిడీ రాజకీయాలకు సర్వేపల్లి ప్రజలు చరమగీతం పాడబోతున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో ఆదివారం మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పచ్చబట్ల శ్రీధర్, కుంచె సిద్ధలయ్య, యమల సుధాకర్, దొడ్డక కిషోర్, కుంచె చంద్ర శేఖర్ తదితరులు సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వెంకటాచలం మండలంలో తనకు అత్యధిక మెజార్టీ రావడం ఖాయమన్నారు. మే 13 తర్వాత కాకాణి తట్టాబుట్ట సర్దుకుని తోడేరు ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు డబ్బుగుంట సురేంద్ర, మల్లి కృష్ణయ్య, ఆత్మకూరు వెంకయ్య, ఆదిశేషయ్య, యమల రాజేంద్ర, చందూరి సురేష్, నరేష్, ఉప్పు రాఘవేంద్ర తదితరులున్నారు.

టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ

ముత్తుకూరు: ప్రజల్లో టీడీపీకి రోజురోజుకి పెరుగుతున్న ఆదరణకు పార్టీలో చేరికలే నిదర్శనమని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో సోమిరెడ్డి సమక్షంలో భారీ చేరికలు జరిగాయి. మండలంలోని కృష్ణపట్నం పంచాయతీ అరుంధతీయవాడకి చెందిన 22 కుటుంబాలు, ఆర్కాట్‌పాలెం నుంచి 19 కుటుంబాలు, ముసునూరివారిపాలెం గ్రామానికి చెందిన 27 కుటుంబాలు, దొరువులపాలెం పంచాయతీలోని వెంకన్నపాలెంలోని 37 కుటుంబాలు, పైనాపురం పంచాయతీలో 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సోమిరెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు నీలం మల్లికార్జునయాదవ్, ఏకొల్లు కోదండయ్య, మామిడాల శ్రీనివాసులు, బొనిగి ఆనందయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

మండపం పంచాయతీలో సోమిరెడ్డి ప్రచారం

తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీలో ఆదివారం తాండ్ర మునికృష్ణ ఆధ్వర్యంలో సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పంచాయతీలో ఉన్న సమస్యలు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు రామయ్య, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వేదాయపాలెంలోని సోమిరెడ్డి నివాసంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే జనసేన లక్ష్యం



వీర మహిళా మండలాధ్యక్షులతో బొబ్బేపల్లి, వాణిభవాని

వెంకటాచలం, మార్చి 31 : కూటమి తరపున పోటీ చేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాద్‌ల గెలుపే జనసేన పార్టీ లక్ష్యమని సర్వేపల్లి నియోజక వర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని సర్వేపల్లిలో పార్టీ కార్యాలయంలో ఆదివారం సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ వీర మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణిభవాని అధ్యక్షతన వీర మహిళా మండల కమిటీలు నియమించారు. వీర మహిళా వెంకటాచలం మండలాధ్యక్షురాలిగా సందూరు సాయిశ్వేత, ఉపాధ్యక్షురాలిగా వలిపి కావేరి, ముత్తుకూరు మండలాధ్యక్షురాలిగా మన్నేపల్లి మస్తానమ్మ, పొదలకూరు మండలాధ్యక్షురాలిగా గురుపర్తి కామాక్షిలతోపాటు మరో 25 మంది మహిళలతో సర్వేపల్లి నియోజకవర్గ మహిళా కమిటీ వేసినట్లు బొబ్బేపల్లి తెలిపారు. అనంతరం కృష్ణా పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలిగా నియమితులైన నాగరత్నంను సన్మానించారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, రహీమ్, అశోక్, మస్తాన్, సుమన్, చిన్న, నవీన్, రాకేష్, శ్రీహరి, రామిరెడ్డి, చెంచయ్య, సుధాకర్, లక్ష్మి, జయసుధ తదితరులున్నారు.

వేమిరెడ్డి దంపతుల గెలుపే లక్ష్యం

బుచ్చిరెడ్డిపాలెం: నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల గెలుపే లక్ష్యమని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాలెంలోని టీడీపీ కార్యాలయంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొని నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డిలను గెలిపించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి బహుమానంగా ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఈమేరకు ఎన్నికల ప్రచారాలతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు ఎంవి శేషయ్య, బత్తల హరికృష్ణ, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నగర పంచాయతీలోని 20 వార్డుల ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

ఇందుకూరుపేట: మండలంలోని చింతోపు అగ్రహారంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కోవూరు శాసనసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా వేమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలయ్య, రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, నరసయ్య, వెంకటరమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వైసీపీకి వర్తించదా ? : బీజేపీ



నిడిగుంటపాళెంలో సీఎం చిత్రాలతో తిరుగుతున్న రేషన్ బియ్యం పంపిణీ వాహనం

వెంకటాచలం, మార్చి 31 : సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీకి ఎన్నికల కోడ్ వర్తించదా అని ఎన్నికల అధికారులను బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ ప్రశ్నించారు. మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో ఆదివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ రేషన్ బియ్యం పంపిణీ వాహనం యథేచ్ఛగా తిరుగుతుండటంపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే కోడ్‌ను ఉల్లంఘించిన వైసీపీ నాయకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సిండికేట్ వలలో 'రూప్‌చంద్'



గుంతల్లో నుంచి పట్టి ఎగుమతులకు సిద్ధం చేస్తున్న రూప్‌చంద్ చేపలు

నెల్లూరు రూరల్, మార్చి 31 : వ్యవసాయంలో సన్నరకాలకు, మత్స్య సాగులో రూప్‌చంద్ చేపలకు గిరాకీ ఎక్కువ. బంగ్లాదేశ్‌లో ఉత్పత్తి అయ్యే ఈ చేప రోగాలను తట్టుకుంటుంది. తెల్ల చేప లైన గండి, బొచ్చలకు సోకే వ్యాధులేవీ దీనికి సోకవనే కార ణంతో అత్యధికంగా రైతులు ఈ రకం చేపలను సాగు చేస్తు న్నారు. వాతావరణ ప్రతికూలతను కూడా తట్టుకునే శక్తి ఉండటంతో సముద్రంలోని ఉప్పు చేపలకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో అత్యధిక మంది రైతులు గుంతల్లో వీటిని సాగు చేస్తు న్నారు. తమిళనాడు, కేరళ, అస్సాం, ఢిల్లీ రాష్ట్రాల్లో ఈ చేపల కు మార్కెట్ ఉంది. దీంతో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా మత్స్య సాగు చేసే రైతులందరు రూప్‌చంద్‌నే ఎంపిక చేసు కుంటు న్నారు. నెల్లూరు రూరల్‌లోని పెద్దచెరుకూరు, అల్లీపురం, గొల్లకందు కూరు, నారాయణరెడ్డి పేట, కోడూరు పాడు, గుడిపల్లిపాడు, వావిలేటిపాడు ప్రాంతాల్లో ఈ చేపల సాగు ఎక్కువగా ఉంది. రమారమి 300 ఎకరాల్లో సుమారు 100 మంది రైతులు ఈ సాగు చేపట్టారు. సరాసరి 4 టన్నుల దిగుబడి వస్తోంది.

> **ఇలాగైతే సాగు చేయలేం..**
>
> 
>
> ప్రస్తుతం ఉన్న ధరలు ఏ మాత్రం గిట్టుబాటు కావు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే ఇక ఇంత కష్టపడటం ఎందుకు?. మేతల ధరలేమో పెరుగుతున్నాయి, కానీ చేపల ధరలు మాత్రం తగ్గిపోతున్నాయి. పైగా సాగుదా రులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు.
>
> **- పొణక శివకుమార్‌రెడ్డి, సాగుదారుడు, గొల్లకందుకూరు**

> **ఆకివీడు, కైకలూరు మార్కెట్ కంటే తక్కువకు కొనుగోలు**
>
> **రైతులకు కేజీకి రూ.15 నష్టం**
>
> **పెట్టుబడి కూడా గిట్టుబాటుకాని పరిస్థితి**
>
> **విలవిల్లాడుతున్న చేపల సాగుదారులు**

ధర దోపిడీ

రూప్‌చంద్ చేప మూడు నెలలపాటు నర్సరీలో ఉండి ఆ తర్వాత రైతుకు చేరుతుంది. గుంతల్లో 6 నెలలు సాగు చేస్తే కేజీ బరువుకు పెరుగుతుంది. ఇందుకు 2 కేజీల వరకు మేత ఖర్చవుతుంది. ఆ మేత ధర కేజీ రూ.36కాగా ఒక చేపకు రూ.72 మేతకే ఖర్చవుతుంది. మరో రూ.13 కరెంట్, ఇతర ఖర్చు లు కలిపి కేజీ చేప పెరగడానికి పెట్టుబడే రూ.85 వరకు అవు తోంది. అయితే జిల్లాలో ఉండే చేపల కొనుగోలు వ్యాపారులంతా ఒక్కటవడంతో ధరలు వలలో చిక్కుకున్న చేపల్లా విలవి లాడుతున్నాయి. రాష్ట్రంలోని కైకలూరు, ఆకివీడు మార్కెట్ ఆధా రంగా ఈ చేప రేటును మన జిల్లాలో నిర్ణయిస్తారు. అక్కడ ప్రస్తుతం కేజీ రూ.100 పలుకుతుండగా ఇక్కడ రూ.104లకు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వ్యాపారులు సిండకేటై రూ.85-90 మధ్య కొనుగోలు చేస్తున్నారు. దీంతో సాగుదారులు లబోదిబోమంటున్నారు. పెట్టుబడులు కూడా గిట్టుబాటుకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

టీడీపీని ఆదరించండి

● కోటంరెడ్డి కుటుంబ సభ్యుల ప్రచారం



అపోస్తలిక్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు చేస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 31 : ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోటంరెడ్డి కుటుంబ సభ్యులు కోరారు. ఆయన సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఆదివారం నగరంలోని 41వ డివిజన్ పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాగా, రూరల్ నియోజకవర్గం నుంచి ఆదివారం తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. 26వ డివిజన్ జ్యోతినగర్, డైవర్స్‌కాలనీకి చెందిన ముస్లింలు శ్రీధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో అల్లాభక్షు, బూడిద పురుషోత్తం యాదవ్, శివాచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే, 32వ డివిజన్ వెంగళ రావునగర్ సీ బ్లాకుకు చెందిన సుమతి వారి మిత్రబృందం, 33వ డివిజన్ నేతాజీనగర్‌కు చెందిన స్థానికులు పార్టీలో చేరారు. మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు. 24వ డివిజన్ కనుపర్తిపాడుకు చెందిన అరవ వినోద్ వారి మిత్ర బృందం కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరింది. 23, 41 డివిజన్లకు చెందిన పలువురు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈస్టర్ ప్రార్థనల్లో శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం): సాటి మనిషిని ప్రేమించడం, బలహీనులకు అండగా ఉండడం ఉత్తమ ధర్మమని, దుర్మార్గులను కూడా క్షమించిన యుగకర్త ఏసుప్రభువు అని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా 36వ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్ అపోస్తలిక్ క్రిస్టియన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

● వేమిరెడ్డి, నారాయణ

నెల్లూరు (విద్య), మార్చి 31 : నీతి నిజాయితీకి, నమ్మకానికి మారుపేరైన ఆర్యవైశ్యులకు అండగా ఉండి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 44వ డివిజన్ క్లాత్‌మర్చంట్స్ హాలులో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రశాంత వాతావరణం కోరుకుంటున్నారని, వారికి భద్రత, భరోసాతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులు టీడీపీకి మద్దతిచ్చి తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేమిరెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉందన్నారు. వారి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకురాలు తాళ్లపాక అనూరాధ, ఫాన్సీ అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ మల్లికార్జునరావు, క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీ కిషోర్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, ఆటోమొబైల్ అధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో నారాయణ, వేమిరెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

టీడీపీని ఆదరించాలి....

ప్రజలంతా టీడీపీని ఆదరించి పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి అభ్యర్థించారు. 16వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళాశక్తి నేతలు, వీరమహిళలు పాల్గొన్నారు.

పార్టీలోకి భారీగా చేరికలు...

నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని 13వ డివిజన్‌కు చెందిన యువత పెద్ద ఎత్తున టీడీపీలో చేరింది. వారికి పొంగూరు నారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, తాళ్లపాక అనూరాధ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు తొలి ప్రాధాన్యం..

మైనార్టీలకు తొలి ప్రాధాన్యతనిచ్చి వారిని అన్ని విధాలుగా ఆదుకున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని నగర అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. మైపాడు గేటు సెంటర్ కేపీఆర్ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. రంజాన్ పండుగను ముస్లింలందరూ సంతోషకరంగా జరుపుకోవాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వైసీపీ నియంత పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీడీపీకి అండగా ఉండి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల వ్యక్తిత్వంపై దృష్టి సారించాలి

● ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 31 : పిల్లల చదువు కోసం వేలాది రూపాయలు వెచ్చిస్తున్న తల్లిదండ్రులు వారి వ్యక్తిత్వం, నడవడికపై దృష్టి సారించాలని జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ కోరారు. నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి సాంబశివరావు విద్యార్థులను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తీర్చిదిద్దుతున్నందుకు అభినందించారు. దేశానికి సేవలందించిన ప్రముఖుల పుస్తకాలను కొనుగోలు చేసి విద్యార్థులకు అందచేయడానికి రూ.10వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ విభాగం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ డీ చంద్రశేఖర్, ఎస్ఆర్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ నవీన్ కుమార్‌రెడ్డి, జీవీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీ రవికుమార్, ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు, బాలు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీడియో సీడీ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 31 : చరిత్రలో చెరగని చిరునామా వీడియో సీడీని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర ఆదివారం విడుదల చేశారు. యువ కవి కే మురళీమోహన్‌రాజు ఈ వీడియో పాట సీడీని తయారు చేశారు. మాగుంట లే అవుట్‌లోని రవిచంద్ర ఇంటిలో దీనిని ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించాలని పిలుపునిస్తూ ఈ పాట రాశారు. కార్యక్రమంలో బొనిగి ఆనందయ్య, ఈపూరు మస్తానయ్య, గుండాల ఉదయ్‌భాస్కర్, వీర రాఘవులు, శ్యామ్ ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అవోపా'లో కంటి వైద్య శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 31 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట అవోపా కార్యాలయంలో ఆదివారం గ్లోకోమా కంటి వైద్య శిబిరం జరిగింది. అవోపా, మోడరన్ కంటి వైద్యశాల సంయుక్తంగా ఈ శిబిరం నిర్వహించాయి. డాక్టర్ చిన్మయి పాల్గొని 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు ఏఎస్ గుప్తా, కార్యదర్శి చలువాది కిరణ్‌కుమార్, కోశాధికారి ఈ హనుమంత రావు, మాజీ అధ్యక్షుడు ఎంపీ ఆంజనేయులు, మహిళా విభాగం అధ్యక్షురాలు పీ కృష్ణప్రియ, కార్యదర్శి కే కావ్య, మాజీ అధ్యక్షురాలు ఎస్ సుభాషిణి తదితరులు పర్యవేక్షించారు.

పడకేసిన పారిశుధ్యం

● వ్యాధుల బారిన ప్రజలు



ఖాజానగర్‌లో దుర్గంధం వెదజల్లుతున్న పాత గుడపల్లి మురుగు కాలువ

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 31 : బుచ్చిరెడ్డిపాలెంలోని ఖాజానగర్, శాంతినగర్, హౌస్ తోట ప్రాంతాల్లోని పాత కొత్త గుడపల్లి మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆయా ప్రాంతాల్లో నివాస ముండే పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గూడపల్లి కాలువ ఉన్న శాంతినగర్ ఎగువ ప్రాంతం నుంచి ఖాజా నగర్ వరకు మురుగు నీరు కిందకు వెళ్లి మార్గం లేక తద్వారా వెదజల్లుతున్న మురుగు దుర్గంధం ఓవైపు, పందుల సంచారం మరోవైపు, దీంతో కాలువ వెంబడి నివాసాలు ఉంటున్న వారు వ్యాధులకు గురువుతు న్నారు. అదేవిధంగా హౌస్ తోటలోని పాతగూడపల్లి కాలువలోని మురుగు కిందకి వెళ్లే మార్గం లేక అక్కడ పరిస్థితి అధ్వానంగా ఉంది. అయితే ఆరు నెలలకు ఏడాదికోసారి నగర పంచాయతీ అధికారులు కాలువలో నామమాత్రంగా మురుగు తొలగించామని పిస్తుంటారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా తమకు మురుగు దుర్గంధం నుంచి విముక్తి కల్పించేవారు కరువవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్ చర్చి వీధిలో గత 5నెలల క్రితం కొంత దూరం పాటు మురుగు కాలువ నిర్మించి వదిలేశారు. దీంతో ఆ కాలవలో చేరిన మురుగు నీరు ఎటూ వెళ్లే మార్గం లేక నెలల తరబడి దుర్గంధం భరించలేకున్నామని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు శనివారం ఆ మురుగు కాలువలో ఓ ట్రాక్టర్‌తో రబ్బిష్ తోలడంతో ఆ మురుగు నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. రబ్బిష్ తోలిన వారిపై చర్యలు తీసుకుని మురుగునీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గూడపల్లి కాలువల వెంబడి నివాసాలున్న ప్రజలకు మురుగు బాధలు తొలగించాలని వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తిరుపతి జిల్లా వార్తలు
సోమవారం 1 ఏప్రిల్ 2024

రెచ్చిపోయిన వైసీపీ ఇసుకాసురులు

- అక్రమ రవాణాను అడ్డుకున్న రైతును చితకబాదారు
- ప్రశ్నించిన మహిళలకు చంపేస్తామంటూ బెదిరింపు



తలకు తగిలిన గాయాన్ని పోలీసులకు చూపిస్తున్న రైతు



కాలప్పపై దాడి చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

పిచ్చాటూరు, మార్చి 31: రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో స్థానికులతో కలిసి ఓ రైతు అడ్డుకున్నాడు. ఇంకేముంది వైసీపీ ఇసుకాసురులు రెచ్చిపోయారు. ఆ రైతును చితకబాదారు. ఈ సంఘటన పిచ్చాటూరు మండలంలోని పులికుండ్రం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అరుణానది పరివాహక ప్రాంతం నుంచి వేలూరు మార్గంలో పులికుండ్రం మీదుగా నారాయణవనం, పుత్తూరుకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతి లేకుండా అధికార పార్టీ నేతలు తరలించేస్తున్నారు. రాత్రిపూట అయితే ఇంకా ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్లను తిప్పుతున్నారు. వీటి వల్ల వస్తున్న శబ్దంతో పులికుండ్రం గ్రామస్తులకు నిద్ర ఉండటం లేదు. పైగా రోడ్డుకు సమీపంలోనే ఇళ్లు ఉండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారు.ఈ క్రమంలో ఆదివారం వేకువ జామున గ్రామానికి చెందిన కాలప్ప అనే రైతు స్థానికులతో కలిసి ట్రాక్టర్లను అడ్డుకున్నాడు. దీనిపై ఆగ్రహించిన వెంగళత్తూరు సర్పంచ్ అన్నాదొరై (వైసీపీ) తన ట్రాక్టర్ డ్రైవర్, మరికొందరితో కలసి కాలప్పను చితకబాదాడు. ఇనుప రాడ్డుతో తలపై కొట్టి గాయపరిచారు. ఇదేమి అన్యాయమని స్థానిక మహిళలు ప్రశ్నిస్తే.. 'పిచ్చాటూరుకు వెళ్లాలంటే వెంగళత్తూరు మీదనే వెళ్లాలి.. వెంగళత్తూరులో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ చంపేస్తాం' అని వైసీపీ ఇసుకాసురులు బెదిరించారు. దీంతో గ్రామపెద్దలు కల్పించుకుని సర్ది చెప్పి.. బాధితుడి గాయానికి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.



అట్టకానితిప్ప చెరువు కట్టను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

'కోడ్' కూశాక అభివృద్ధి పనులా?

- అధికార పార్టీ నాయకుల తీరుపై గ్రామస్తుల అభ్యంతరం
- పనులను ఆపించిన అధికారులు

సూళ్లూరుపేట, మార్చి 31: ఎన్నికల కోడ్ కూసినా కొందరు అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తూ ఓటర్లకు ఎరవేస్తున్నారు. ఇటువంటిదే సూళ్లూరుపేట మండలం అట్టకానితిప్ప గ్రామంలో జరిగింది. గ్రామంలోని చెరువు పొర్లుకట్టల పనులను అధికార పార్టీ నేతలు ఆదివారం చేపట్టి.. హడావిడి చేశారు. వాస్తవానికి టెండర్లు దక్కించుకొన్న కాంట్రాక్టర్.. ఆ పనులను అధికార పార్టీ నాయకులకు ఇచ్చేశారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉండిన గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఇపుడు పనులు ప్రారంభించారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ పనులను నిలుపుదల చేయించారు.

రూ.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- పట్టీపట్టనట్లు రెవెన్యూ శాఖ



కుర్రకాలువ పాకశాస్త్ర విశ్వవిద్యాలయం ఎదురుగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

రేణిగుంట, మార్చి 31: కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా రెవెన్యూశాఖ పట్టీపట్టనట్లు ఉంటోందని స్థానికులు విమర్శిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం కుర్రకాలువ లెక్క దాఖలాలో సర్వే నెంబరు 112/1, 2, 3లో నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ అవసరాలకు గతంలో రిజర్వుచేసిన ఈ భూమిలో ప్రైవేటు వెంచర్‌ను తలపించేలా రోడ్లు వేసి.. చిన్న చిన్న ఇళ్లను నిర్మించి మరీ విక్రయించేస్తున్నారు. గతంలో ఇదే భూమిలో నిర్మాణాలు చేపడితే రెవెన్యూశాఖ తూతూ మంత్రంగా రెండు ఇళ్లను కూల్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం యథేచ్ఛగా చిన్నపాటి ఇళ్లను నిర్మించి అమ్ముకుంటున్నారు. దీనివెనుక వేరే పంచాయతీ పరిధిలోని ఇద్దరు సర్పంచులు ఉన్నట్లు సమాచారం. వీరు తమ పేరు బయటపడకుండా తిరుపతికి చెందిన ఓ దళిత నేతను ముందుపెట్టి పని కానిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనిలోపనిగా.. పెట్టుబడి పెడితే చాలు అంతా తాము చూసుకుంటామని.. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే వీరు కబ్జా చేస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూశాఖ పట్టించుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో పాకశాస్త్ర విశ్వవిద్యాలయం, టీసీఎల్, మరెన్నో పరిశ్రమలు రావడంతో భూముల విలువ అమాంతంగా పెరిగిపోయింది. అందువల్ల కలెక్టర్ స్పందించి.. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సి ఉంది.

చంద్రబాబుకు ఘన వీడ్కోలు



చంద్రబాబు నుదుటన బొట్టు పెడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు శ్రీకాళహస్తిలో ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో శనివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ అధినేత విచ్చేసిన విషయం తెలిసిందే. సభ అనంతరం ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బస చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును కలిసి వీడ్కోలు పలికేందుకు ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచే పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ జనసేన, నేతలు కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి పాదాల చెంత శ్రీచక్రంపై అర్చించిన కుంకుమను, ముక్కంటి ఆలయ తీర్థ ప్రసాదాలను చంద్రబాబుకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అందజేశారు. అనంతరం బొజ్జలతో అధినేత ఏకాంతంగా చర్చలు జరిపారు. తర్వాత మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత దంపతులు చంద్రబాబును కలిసి శేష వస్త్రంతో సత్కరించారు. అలాగే తన కారవాన్ నుంచి మాజీ సీఎం వెలుపలకు రాగానే పలువురు నాయకులు ఘనంగా సత్కరించి, దేవతామూర్తుల చిత్రపటాలను బహూకరించారు. ఉదయం 10.31 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి చంద్రబాబు కాన్వాయ్ బయల్దేరింది. ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోని హెలిప్యాడ్ చేరుకుని 10.41 ప్రాంతంలో హెలికాప్టర్‌లో కర్నూలు జిల్లా పర్యటనకు వెళ్లారు.

జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైం, మార్చి 31: జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ పూర్ణచంద్రరావును సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి రూరల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పూర్ణచంద్రరావు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట మామిడి తోపులో కొందరితో కలసి ఇటీవల జూదం ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో కానిస్టేబుల్‌పై ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

రేపటినుంచి ముత్యాలమ్మ జాతర

- తూర్పు కనుపూరులో ఏర్పాట్లు పూర్తి: ఈవో



నవీన్‌కుమార్

చిల్లకూరు, మార్చి 31: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ జాతర.. మంగళవారం నుంచి ఈనెల ఐదో తేదీవరకు జరుగుతుందని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జాతరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు జాతరకు తరలివస్తారన్నారు. వీరందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో అర్చకులు శివయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

11 మంది వలంటీర్ల సస్పెన్షన్ : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 31: ఎన్నికల నియమావళిని అతిక్రమించిన 11మంది వలంటీర్లను ఆదివారం నాటికి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వీరిలో.. ఏర్పేడులో నలుగురు, నారాయణవనంలో ముగ్గురు, బీఎన్‌కండ్రిగలో ఇద్దరు, రేణిగుంట, పుత్తూరులో ఒకరు చొప్పున ఉన్నారన్నారు. వీరంతా ప్రభుత్వం ఇచ్చిన పరికరాలను (మొబైల్, ట్యాబ్ తదితరాలు) కలెక్టరేట్‌లో అందజేయాలని ఆదేశించారు.

నేటినుంచి 'టెన్త్' మూల్యాంకనం

తిరుపతి(విద్య), మార్చి 31: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 8 రోజుల పాటు తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా జరగనుంది. 7 పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్‌లతో కూడిన 1.80 లక్షల తెలుగు, ఆంగ్ల మీడియం పేపర్లను మూల్యాంకనం చేయనున్నారు. 900 మంది ఉపాధ్యాయులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. జిల్లాకు క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో డాక్టర్ వి.శేఖర్ వ్యవహరిస్తారు. మరో 10 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులను అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లుగా నియమించారు. మూల్యాంకనానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో తెలిపారు.

ఎస్వీయూ లా విభాగానికి ఆరుగురు గౌరవాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 31: ఎస్వీ యూనివర్సిటీ లా విభాగంలో ఆరుగురు గౌరవ ఆచార్యుల నియామకానికి మార్గం సుగమమైంది. లా విభాగం పరిధిలో నిర్వహించే బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు విద్యార్థులకు అవసరమైన బోధన, మార్గదర్శకత్వం, కోర్సు అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు, గుర్తింపునకు వీరు తోడ్పడే అవకాశం ఉంటుంది. వేతన రహిత సేవలు అందించడానికి వారు సుముఖత వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ దశమ వార్షికోత్సవాల సందర్భంగా ఈ విషయాన్ని చర్చించినట్లు సమాచారం. నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ వైఆర్ హరగోపాల్‌రెడ్డి, చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ఎ.లక్ష్మీనాథ్, గోవాలోని ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ఆర్.వెంకటరావు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు, సుప్రీంకోర్టు డిసిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది మహాలక్ష్మీ పావని, ఢిల్లీ లా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ రణధీర్‌సింగ్‌లను నియమించాలని భావిస్తున్నారు.



తిరునగరిలో శ్రద్ధాదాస్ సందడి

సినీ నటి శ్రద్ధాదాస్ తిరుపతిలో సందడి చేశారు. 'పారిజాతపర్వం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం చిత్ర నటీనటులతో కలిసి నగరానికి వచ్చారు.

వైసీపీ అభ్యర్థికి నిరసన సెగ



రాజేష్‌ని అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- మాదిగపల్లెలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్న ఎమ్మార్పీఎస్

సత్యవేడు, మార్చి 31: సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌కి నిరసన సెగ తగిలింది. సత్యవేడు మండలం మాధనపాళెంలో ఆదివారం ప్రచారానికి వెళ్లిన ఆయన్ను ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నిలదీశారు. మాదిగలకు అన్యాయం చేసిన వైసీపీకి మాదిగపల్లెలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పైగా తమ సమస్యలను ఏనాడూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. అటువంటిది ఇప్పుడు ఓట్లు అడిగేందుకు ఎలా వచ్చారని ప్రశ్నించారు. తమ చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రం నుంచి కనీసం లాయర్‌ని కూడా నియమించని జగన్ ప్రభుత్వానికి ఓటు హక్కుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మాదిగపల్లెలోకి వైసీపీ నాయకులను రానివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ధనరాజు మాదిగ, వెంకటేష్ మాదిగ, మునిబాబు మాదిగ, ముని ప్రశాంత్ మాదిగ, నాగేంద్ర మాదిగ, మునస్వామి మాదిగ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం): సా. 6.27
సహరి (మంగళవారం) : ఉ. 4.49

ఇవేం కక్కుర్తి పనులు..?



కుంగిపోయిన ఫ్లోరింగ్

- 'ముక్కంటి' నిధులతో నాసిరకం నిర్మాణాలు
- నెల రోజులకే కుంగిపోయిన షెడ్ ఫ్లోరింగ్

శ్రీకాళహస్తి, మార్చి 31: ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ అధికారుల తీరు మారడం లేదు. కమీషన్ల కక్కుర్తితో నాసిరకం నిర్మాణాలను సాగిస్తూనే ఉన్నారు. నెల రోజుల క్రితం అనవసరమైన ప్రదేశంలో భక్తుల బస సాకును చూపుతూ ఆగమేఘాలపై షెడ్ నిర్మించారు. అంతే వేగంగా అందులోని ఫ్లోరింగ్ కుంగిపోవడం సామాజిక మాధ్యమాల్లో ఆదివారం దుమారం రేగింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఉన్న స్థలాల్లో కమీషన్ల కోసం ఇటీవల పాలకులు, ఆలయ అధికారులు తాత్కాలిక నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అయినా ధనార్జనే ధ్యేయంగా తాత్కాలిక నిర్మాణాలు ప్రారంభించారు. భక్తులకు వసతి కల్పించాలన్న సాకుతో ఆలయ 2వ గేటు సమీపంలో రూ.34లక్షలతో షెడ్డు నిర్మించారు. అలాగే 2వ గేటు నుంచి 3వ గేటు వరకు మాస్టర్ ప్లాన్ కోసం సేకరించిన స్థలానికి హద్దుగా ఎలాంటి అవసరం లేకపోయినా పిట్టగోడను నిర్మించారు. నెల క్రితం ఆర్భాటంగా షెడ్డును ప్రారంభించారు. అంతలోనే షెడ్డు ఫ్లోరింగ్ కుంగిపోయింది. దీన్ని చూసిన కొందరు భక్తులు.. ఇవేం కక్కుర్తి పనులు అంటూ సామాజిక మాధ్యమాల్లో విస్మయం వ్యక్తం చేశారు. శివయ్య సొమ్మును ఇలా స్వాహా చేస్తున్నారంటూ పాలకులు, అధికారులు తీరును బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇకనైనా ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ విభాగంపై దేవదాయశాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలకు అనుమతి తప్పనిసరి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 31: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ప్రసార మాధ్యమాల్లో వెలువడే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఇందుకోసం జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల రాజకీయ ప్రచార ప్రకటనలు ప్రసారం చేసేందుకు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందని వివరించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్స్ ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు. సదరు ప్రకటనకు అయ్యే ఖర్చును సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31: సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన, అసత్య వార్తలు, ప్రకటనలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం, బెదిరింపులు చేయడం వంటివి పోస్టు చేస్తే సంబంధిత అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అలాంటి పోస్టులు కనిపిస్తే స్థానిక పోలీసులకు కానీ, వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

15 గ్రాముల బంగారం, 6 కిలోల వెండి స్వాధీనం



చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 31: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 15 గ్రాముల బంగారం, 6కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సాయంత్రం వెల్లడించారు. పుత్తూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నరేష్, పెళ్లకూరు మండలం కలవకూరు గ్రామంలోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఈనెల 18వ తేదీ నాయుడుపేట పట్టణంలోని ఓ బంగారు దుకాణ షెట్టర్‌ను తొలగించి అందులోని 15 గ్రాముల బంగారు నగలు, 6 కిలోల వెండి ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాయుడుపేట పట్టణంలోని గాంధీమందిరం వద్ద నిందితుడు నరేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడ్డ బంగారు, వెండి ఆభరణాల విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. కేసు విచారణలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ గోపి, సిబ్బంది చిరంజీవి, రామమోహన్‌రాజు, దయాకర్, వెంకీలను సీఐ అభినందించారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి: పాశం



టీడీపీలో చేరిన ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 31: టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈద్గా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షబ్బీర్ ఆధ్వర్యంలో ముస్లిం యువత టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీపాలనలో అన్నీ వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా మోసం చేసిందన్నారు. ముస్లింల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు ఎన్నో పథకాలు అమలు చేశారని, వాటిన్నింటినీ జగన్ నిలిపివేశారని విమర్శించారు. కొవిడ్ సమయంలో ఈద్గా యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రజలకు ఎంతో సేవ చేశారని, వీరంతా స్వచ్ఛందంగా టీడీపీలో చేరడం ఆనందించతగ్గ విషయమన్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ అధికారంలో ఉండాలని ఆకాంక్షించి పలువురు యవకులు పార్టీలో చేరుతున్నారని సునీల్‌కుమార్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, నరసింహుల నాయుడు, చంద్రమౌళి, మున్నా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న వేదకార్తిక్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 31: పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామానికి చెందిన వేదకార్తిక్‌రెడ్డి, జశ్వితరెడ్డి రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయిలో చెస్ పోటీల్లో 200 మందికి పైగా చిన్నారులు పాల్గొనగా, వేదకార్తిక్ రెడ్డి ప్రథమ బహుమతి, జశ్వితారెడ్డి ద్వితీయ బహుమతి అందుకున్నారు.

ఎంపీడీవో గోపీనాథ్‌కు సన్మానం



ఎంపీడీవో గోపీనాథ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వాకాడు, మార్చి 31: వాకాడు ఎంపీడీవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గోపీనాథ్‌ను ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండలంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డితో పాటు రాజకీయ వివిధ పార్టీల నాయకులు, అధికారులు, సిబ్బంది ఎంపీడీవోను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ఎంఈవో నసీం అలీ, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు



వాకాడు, మార్చి 31: వాకాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఎంపీడీవో గోపీనాథ్‌ను ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమిస్తూ కలెక్టర్ లక్ష్మీషా ఉత్తర్వులు ఇచ్చారు.

ఉత్తమ బోధనే లక్ష్యం

చిల్లకూరు, మార్చి 31: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడమే ఎల్‌ఏపీ పాఠశాల లక్ష్యమని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరం నుంచి తమ పాఠశాలలో 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు ముంబైకి చెందిన లీడ్ ఫౌండేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ఐఐటీ అవగాహన తరగతులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు భవిష్యత్తులో ఐఐటీలో ర్యాంకు పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీలత, ఓనమఃశివాయ, సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

వాకాడు, మార్చి 31: ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని గొల్లపాళెం గ్రామంలో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గుర్తులతో వాహనాలను నడపరాదని, అక్రమ మద్యం నిల్వ ఉండరాదన్నారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సూళ్లూరుపేట, మార్చి 31: సూళ్లూరుపేట పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ రహీం రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి బజారు వీధుల్లో తిరిగారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపరాదని, దుకాణదారులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'సూర్య' ప్రతాపం

నిర్మానుష్యంగా ప్రధాన వీధులు

నాయుడుపేట, మార్చి 31: సూర్య భగవానుడు ఆదివారం నిప్పులు కక్కడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం కూడా ఎండ తగ్గకపోవడంతో నాయుడుపేట పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. మార్చి చివరి రోజునే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన వీధులు జన సంచారం లేకపోవడంతో కర్ఫ్యూను తలపించాయి.



జనసంచారం లేని వెల్‌కం సెంటర్

సహకారశాఖలో ట్రాక్టర్లు మాయం!

గూడూరు అర్బన్, మార్చి 31: వర్షాభావం నెలకొన్న ప్రాంతాల్లో అన్నదాతకు ఆసరాగా నిలిచేందుకు సహకార సొసైటీలకు ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్లు మాయమయ్యాయి. ఆర్‌కేవీవై పథకం కింద 2013-14వ ఆర్థిక సంవత్సరంలో రూ.33కోట్లు ఖర్చు చేసి 660 ట్రాక్టర్లను సహకార సొసైటీలకు అందించగా ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. సహకార సొసైటీల్లో అడ్డదారిలో పెత్తనం వెలగబెట్టిన వారే వాటిని స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రీయ కృషివికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఏడు రాష్ట్రాల్లో కేంద్ర ప్రారంభించింది. వర్షాభావ ప్రాంతాల్లో అపరాలు, నూనెగింజలు పండించే పది గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అక్కడ కనీసం 10 శాతం అధిక ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేశారు. రాష్ట్రంలో 48.28 లక్షల హెక్టార్లలో 34.58 లక్షల మెట్రిక్ టన్నుల గింజల ఉత్పత్తి కోసం 21 జిల్లాలో 660 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు రూ.5లక్షలు వెచ్చించి 35 హెచ్‌బీ ట్రాక్టరు, రోటా వేటరు, సాళ్లల్లో విత్తనాలను వేసే యత్రం (రిడ్జ్‌పర్రోప్లాంటర్)లను సొసైటీలకు అందించారు. ఇందుకోసం రూ.33 కోట్లు ఖర్చు చేశారు. మండలాల్లో సహకార సొసైటీ(పీఏసీఎస్)ల సీఈవో, మండల వ్యవసాయ అధికారులు వీటి పర్యవేక్షణ చేయాల్సివుంది. క్లస్టర్లలోని సభ్యులకు దుక్కి కోసం ఎకరానికి రూ.200 వసూలు చేసి ప్రతినెలా ఉన్నతాధికారులకు వివరాలు పంపాలి. ప్రారంభంలో సవ్యంగానే సాగినా, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, చాలాచోట్ల ఈ ట్రాక్టర్లు, ఇతర యంత్ర పనిముట్లు క్రమేపీ కనుమరుగయ్యాయి. పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం ఐదేళ్ల క్రితమే పూర్తయినా అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. నామినేటెడ్ పద్ధతిలో ఆరు నెలల చొప్పున ఐదేళ్లు త్రిమెన్ కమిటీలే కొలువుదీరాయి. ఇందులో 100 శాతం వైసీపీ



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

నేతలే పర్సన్ ఇచ్చార్జులుగా పెత్తనం చలాయించారు. పార్టీలోని వర్గవిభేదాలతో కొన్నిచోట్ల ఆరు నెలలకు పర్సన్ ఇన్‌చార్జులు మారిపోగా, కొన్నిచోట్ల ఒక్కరే ఇప్పటి దాకా కొనసాగారు. సర్వజన సభలు, పూర్తిపాలక వర్గం లేకపోవడంతో వీళ్ల ఆడిందే ఆటగా సాగింది. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఆర్‌కేవీవై ట్రాక్టర్లను వీళ్లే స్వాహా చేశారని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చాక ట్రాక్టర్ల విషయమై ప్రస్తావించిన ఆశాఖ అధికారులను వైసీపీ నేతలు తమదైన శైలిలో బెదిరించడంతో, ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిసింది.

టీడీపీలో యువత, మహిళలకు ప్రాధాన్యం



టీడీపీలో చేరిన వారితో కొండేపాటి గంగాప్రసాద్, నెలవల

తడ, మార్చి 31: తడ మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. కొండూరు పంచాయతీకి చెందిన వైసీపీ నేత దువ్వూరు శ్యామ్‌సుందర్ రెడ్డి, స్థానిక సర్పంచు వాటంబేడు శ్రీలక్ష్మితో పాటు వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గంగాప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులుగా యువ మహిళలకు చంద్రబాబు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అరాచక, దోపిడీ పాలలను గద్దెదింపే సమయం ఆసన్నమైందని, ఓటుతో దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు ఆకుతోట రమేష్, కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి, మాధవనాయుడు, సెల్వం, విజయకుమార్ నాయుడు, నీలకంఠం, జీవ, రవి తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల కలయికతో వైసీపీలో వణుకు: పాశం

గూడూరు, మార్చి 31: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కలయికతో వైసీపీలో వణుకు మొదలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉందన్నారు. వైసీపీని ఇంటికి పంపడానికే ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండడానికే మూడు పార్టీలు పొత్తు పెట్టుకుని కూటమిగా పోటీ చేయడం జరుగుతోందన్నారు. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలను మోసం చేశారని అన్నారు. వలంటీర్ల సేవలను టీడీపీ అడ్డుకుంటోందని తప్పుడు ప్రచారాలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేలు పింఛను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రనీల్, ఇంద్రల్, మనోజ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, వాటంబేడు శివకుమార్, భైరప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

సర్పంచులకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు హర్షణీయం

పెళ్లకూరు, మార్చి 31: సర్పంచులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోండు శంకర్‌తో పాటు అనంతపురం, విజయనగరం జిల్లాల నుంచి మరో ఇద్దరు సర్పంచులకు ఎమ్మెల్యేలుగా టికెట్లు కేటాయించడంపై సంతోషకరమన్నారు. సూళ్లూరుపేటలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మోజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు.



చంద్రబాబుతో నాగేంద్రప్రసాద్‌రెడ్డి

ఆధ్యాత్మికత, సేవాభావమే రంజాన్ మాస ప్రత్యేకత

గూడూరు అర్బన్, మార్చి 31: ఆధ్యాత్మికత, సేవాభావమే రంజాన్ మాసం ప్రత్యేకత అని లయన్స్‌క్లబ్ సభ్యుడు రియాజ్ ఆహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక దర్గా సమీపంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రియాజ్‌ఆహ్మద్, మగ్దూం, నూర్‌అహ్మద్, షాన్‌వాజ్, ఛాన్‌బాషా, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రియాజ్‌ఆహ్మద్

మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, మార్చి 31: అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను చెక్‌పోస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నెల్లూరు వైపు వెళ్తున్న ఒక కారులో 12 బీరు బాటిళ్లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో యువకుల ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 31: గంజాయి మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ఓజిలి మండలం గద్దగుంట గ్రామానికి చెందిన యువకుడిపై నాయుడుపేట పట్టణానికి చెందిన మరో యువకుడు గంజాయి మత్తులో బ్లేడ్‌తో మెడపై దాడిచేసి గాయపరిచాడు. స్థానిక యువకులు అడ్డుకుని గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కోటమ్మకు పూజలు

కోట, మార్చి 31: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ఎన్నికల తరువాత జగన్ జైలుకే: కురుగొండ్ల



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 31: అవినీతి కేసుల్లో కూరుకుపోయిన సీఎం జగన్ ఎన్నికల తరువాత జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ పరిధిలోని 5వ వార్డు, మండల పరిధిలోని డి.ఉప్పరపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పరపల్లిలో వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు మోహన్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకొన్న జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని టీడీపీని గెలిపించాలని కోరారు. ఇక 11వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు, నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, వల్లభనేని మధుసూదన్‌నాయుడు, గల్లా శ్రీనివాసులు, కాపా శ్రీనివాసులు నాయుడు, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, శ్రీరామదాసు గంగాధర్, మల్లారం బాబు, 3వార్డు కౌన్సిలర్ పొట్టేలళ్ల ప్రభావతి, మల్లారం లక్ష్మి, చల్లా మల్లికార్జున్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రాధ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: నెలవల



ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, మార్చి 31: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం చిల్లమానుచేనులో ఆదివారం ఆయన మండలంలోని పార్టీ నేతలు, ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలన, అణచివేత, దాడులు, దోపిడీలను వివరించారు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు టీడీపీలో చేరడంతో వారికి నెలవల పార్టీ కండువా కప్పి ఆహ్వానించాడు. ఈసందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలో ఉందని, వారు రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీలో చేరడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు గుజ్జులహూడి విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మైనారిటీ జిల్లా సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ఎద్దల ధనుంజయరెడ్డి, కార్తీక్‌రాజు, అల్లాభక్షు, పురుషోత్తంరాజు, ఈశ్వరరాజు, సోమశేఖర్‌రాజు, శంకర్‌రాజు, మన్మధరావు, నెలవల రాజేష్, ప్రభాకర నాయుడు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్‌డే ప్రార్థనలు

గూడూరు అర్బన్/కోట, మార్చి 31: గూడూరు పట్టణంలోని ఎస్‌ఏఎల్‌సీ చర్చి, ప్రార్థనా మందిరం, హోసన్నమందిరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే కోట మండలంలోని కోట, విద్యానగర్, గూడలి, చిట్టేడు, తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎన్నికల ఉల్లంఘనకు ముకుతాడు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

- అక్రమాలకు చెక్ సి-విజిల్ యాప్
- ఫిర్యాదుల కోసం (0877-2236007) కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

సూళ్లూరుపేట, మార్చి 31: సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని కనిపెట్టి అక్రమాలకు చెక్ పెట్టేందుకు పలు రకాల యాప్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎన్నికల ప్రలోభాలు, అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో కోడ్ ఉల్లంఘన, ఓటర్లకు కావాల్సిన సమాచారం తెలుసుకోవడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

వంద నిమిషాల్లో చర్యలు..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి. ఫోన్‌కు వచ్చిన ఓటీపీని రిజిస్టర్ చేసుకోవాలి. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ప్రత్యేకంగా తీసిన వీడియోలు, ఫొటోలు, ఆడియో అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదు రిజిస్టర్ అయితే యూనిక్ ఐడీ నంబరు వస్తుంది. తద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో జిల్లా యంత్రాంగం పరిష్కరిస్తుంది. ఫిర్యాదుల పర్యవేక్షణకు జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావును నోడల్ అధికారిగా నియమించారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.



సి-విజిల్ యాప్

వీటన్నింటికీ అడ్డుకట్ట వేయొచ్చు

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న ఏ విషయం పైనైనా ఫిర్యాదు చేయవచ్చు. నగదు, మద్యం, ఉచితాల పంపిణీ, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రసంగాలు, తప్పుడు వార్తల ప్రచారం, పోలింగ్ రోజున ఓటర్లను వాహనాల్లో తరలించడం, ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వంటి అంశాలను ఫొటో, వీడియో, ఆడియో రూపాల్లో రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు.

ఎన్‌జీఎస్‌పీ : ఎన్నికల ఫిర్యాదులు, ప్రశ్నలను దాఖలు చేయడానికి నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) యాప్ దోహదపడుతుంది.

సువిధ : అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రదర్శనలు, సమావేశాలు, ఇతర ప్రచార సంబంధిత కార్యకలాపాలకు అనుమతులను అభ్యర్థించడానికి ఇది ఉపయోపడుతుంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం : ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీనికి నోడల్ అధికారిగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథరామిరెడ్డిని నియమించారు. ఎవరైనా సరే 0877-2236007కు ఫోన్‌చేసి తగిన వివరాలు తెలుసుకోవడంతోపాటు ఫిర్యాదులు చేయవచ్చు. ఓటర్లు 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి తగిన సమాచారం పొందవచ్చు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి, చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో ఓ బృందాన్ని నియమించారు.

దివ్యాంగుల చేయూతకు సాక్ష్యం : వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రత్యేకంగా సహాయకులను అందుబాటులో ఉంచుతారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూరుస్తారు. 85 సంవత్సరాలు దాటినవారు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ యాప్ నిర్వహణకు నోడల్ అధికారిగా మెప్మా పీడీ రాధమ్మను నియమించారు.